తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం


ఎడిటర్ : - దయాకర్ రెడ్డి | సంపుటి: 5 సంచిక: 80 పేజీలు : 08 | బుధవారం, మార్చి 11, 2026 వెల: 3 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

D NEWS


# డ్రగ్ ఇన్స్పెక్టర్ సెటిల్మెంట్ డ్రామా?

## మెడికల్ షాప్ పై వరుస దాడులు!




- పార్ట్నర్షిప్ కోసం బెదిరించిన వ్యక్తికి వత్తాసుగా
- తనిఖీల పేరుతో వేధింపులు గురి చేస్తున్న డ్రగ్ ఇన్స్పెక్టర్
- సెటిల్మెంట్ చేసుకోవాలంటూ సలహా
- ఒకే మెడికల్ షాప్ పై పలుమార్లు తనిఖీలు
- ఒకసారి ఏకంగా సీజ్..
- మరోసారి తనిఖీల పేరిట బెదిరింపు
- తాజాగా మంగళవారం తనిఖీలతో వేధింపు
- మీడియా జోక్యం చేసుకోవడంతో వెళ్లిపోయిన డ్రగ్ ఇన్స్పెక్టర్
- కూన రాజకుమార్ గౌడ్ వేధిస్తున్నాడంటూ

మహిళా బాధితురాలు ఆవేదన


మంగళవారం షాప్ లో తనిఖీలు చేస్తున్న డ్రగ్ అధికారులు.

**కుత్బుల్లాపూర్/మేడ్చల్ ప్రతినిధి:** రక్షించాల్సిన వారే భక్షకులుగా మారితే.. చట్టాన్ని కాపాడాల్సిన వారే అక్రమార్కులకు కొమ్ముకాస్తే సామాన్యుడి పరిస్థితి ఏమిటి? మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలో ఇప్పుడు ఇదే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. విధుల్లో పారదర్శకత పాటించాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారులు, కొందరు ప్రైవేట్ వ్యక్తులతో చేతులు కలిపి మెడికల్ షాపుల యజమానులను వేధింపులకు గురిచేస్తుండటం స్థానికంగా కలకలం రేపుతోంది. బాధితుల వివరాలు, అందించిన ఆధారాల ప్రకారం...

### ఏం జరిగిందంటే?..

జీడిమెట్ల గ్రామానికి చెందిన భాగ్య లక్ష్మీ గత కొంతకాలంగా 'నోబుల్ పెట్ అండ్ వెట్' పేరుతో పశువుల మందుల దుకాణాన్ని నడుపుతున్నారు. వ్యాపారం సాఫీగా సాగుతున్న తరుణంలో, స్థానికంగా నివసించే కూన రాజ్‌కుమార్ అనే వ్యక్తి కన్ను ఆ షాపుపై పడింది. తనకు రాజకీయ పలుకుబడి ఉందని, మంత్రికి అత్యంత ఆప్తుడినని చెప్పుకుంటూ.. షాపులో వాటా ఇవ్వాలని లేదా నెలనెలా 'మామూళ్లు' సమర్పించాలని భాగ్య లక్ష్మీ భర్తకు ఫోన్ చేసి వేధించడం మొదలుపెట్టాడు.

### అధికారులతో బెదిరింపులు.. పోలీసుల జోక్యం

రాజ్‌కుమార్ అడిగిన దానికి యజమాని నిరాకరించడంతో, తనకున్న పరిచయాలతో డ్రగ్ కంట్రోల్ అధికారులను ఉసిగొల్పి తనిఖీల పేరుతో వేధింపులకు తెరలేపాడు. ఒక సందర్భంలో డ్రగ్ అధికారులు షాప్ ను మూసివేశారు. ఆపై కూడా వేధింపులు కొనసాగుతూ ఉండడంతో బాధితురాలు గతంలోనే జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రాజ్‌కుమార్‌ను పిలిపించి మందలించినప్పటికీ, అతని తీరులో మార్పు రాలేదు. అధికారులను అడ్డం పెట్టుకుని మళ్లీ పాత పద్ధతిలోనే బెదిరింపులకు దిగాడు.

### పరువు నష్టం దావా నోటీసు..

చేసిందంతా చేసిన రాజ్ కుమార్ తిరిగి తన పరువు తీసాడని పేర్కొంటూ బాధితురాలు భర్త శివకుమార్ కు పరువు నష్టం దావ నోటీసు ఇచ్చాడు. దీనికి బదులుగా బాధితులు సమాధానం లాయర్ ద్వారా అందించారు. ఇది జరిగిన కొద్ది రోజులకు....

### మీడియాను చూసి జారుకున్న..

తాజాగా, రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కుత్బుల్లాపూర్ మండల డ్రగ్ కంట్రోల్ అధికారి తిరుపతి. మల్కాజిగిరి డ్రగ్ కంట్రోల్ అధికారి మురళీకృష్ణలు సదరు మెడికల్ షాపులో తనిఖీలకు వెళ్లారు. అయితే, విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు తనిఖీలు చేస్తున్న దుకాణానికి వెళ్లగానే అక్కడినుంచి అధికారులు జరుకునే ప్రయత్నం చేశారు. మీడియా ప్రతినిధులు ప్రశ్నించడంతో పిర్యాదు మేరకు రావడం జరిగిందని తెలిపారు. కాగా అప్పటికే వేధింపులతో విసిగిపోయిన యజమాని భాగ్యలక్ష్మి మీడియాను ఆశ్రయించి జరిగింది, జరుగుతుంది మొత్తం .



బాధితురాలు... భాగ్యలక్ష్మి

మీడియా ప్రతినిధులు ముందు బాధను వెళ్లగక్కున్నారు. ఇక తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్న అధికారులు సమాధానం చెప్పలేక అక్కడి నుండి జారుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### "ప్రైవేటు వ్యక్తి ప్రయోజనాల కోసం...ప్రభుత్వ అధికారులు..

ఒక ప్రైవేట్ వ్యక్తి ప్రయోజనాల కోసం పనిచేయడం డ్రగ్ కంట్రోల్ అధికారులు పనిచేయడం సిగ్గుచేటు అని విమర్శిస్తున్నారు. నిజాయితీగా వ్యాపారం చేసుకునే వారిని భయభ్రాంతులకు గురిచేసి, 'సెటిల్మెంట్లు' చేసుకోవాలని ఉచిత సలహాలు ఇవ్వడం వారి విధి నిర్వహణలో భాగమా?" అని స్థానిక వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై సామాన్యులను ఇబ్బంది పెడుతున్న అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపించాలనీ, రాజకీయ అండ చూసుకుని వ్యాపారస్తులను బ్లాక్ మెయిల్ చేస్తున్న రాజ్‌కుమార్ వంటి వ్యక్తులపై అతనికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ కోరుతున్నారు బాధితులు. అధికార ముసుగులో జరుగుతున్న ఈ దోపిడీ పర్వానికి జిల్లా యంత్రాంగం ఇప్పుడైనా అడ్డుకట్ట వేస్తుందా? లేక లోపాయికారి ఒప్పందాలతో అక్రమార్కులకు వత్తాసు పలుకుతుందా? వేచి చూడాలి.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్

- ప్రభాకర్ రావుకు అరెస్ట్ నుంచి మినహాయింపునిచ్చిన సుప్రీంకోర్టు
- సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేయవద్దని షరతు
- కోర్టు అనుమతి లేకుండా రాష్ట్రం, దేశం విడిచి వెళ్లకూడదని కండిషన్

2లో..



## నూతన గవర్నర్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఘన స్వాగతం

2లో..



## ఇరాన్, అమెరికా యుద్ధంతో గ్యాస్ కొరత


- మెనులో వంటకాలు తగ్గించిన హోటల్స్

2లో..



## మూసీలో నిత్యం మంచినీటి ప్రవాహం

- గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ డీపీఆర్ రెడీ - 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం



**హైదరాబాద్** హైదరాబాద్ నగర నడిబొడ్డున ప్రవహించే మూసీ నదిని అందంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మురుగు, వ్యర్థాలతో ప్రవహిస్తున్న మూసీ నదిని ప్రపంచ స్థాయి పర్యాటక, ఆర్థిక కేంద్రంగా మార్చటమే లక్ష్యంగా సర్కార్ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టింది. ఈ చర్యలో భాగంగా బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌ను సైతం చేపడుతోంది. ఈ మేరకు తాజాగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్ఎడ్డిసిఎల్) డీపీఆర్‌ను సిద్ధం చేసింది. బాపూఘాట్ వద్ద 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం నిర్మాణం కానుంది. మూసీ నదికి రెండు వైపులా విశాలమైన రోడ్లు, నది పొడవునా ఆకట్టుకునే పార్కులు ఏర్పాటు కానున్నాయి.బాపూఘాట్ వద్ద ప్రభుత్వానికి 60 ఎకరాల భూమి భూమి ఉంది. ఇందులో 34 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతుంది. 100 మీటర్ల ఎత్తు వరకు పలు అంతస్తుల్లో టవర్ కట్టి అందులో సమావేశ గదులు, మ్యూజియం, గాంధీ

2లో..

## కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయాలు

- రూ.8.80 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం



**న్యూఢిల్లీ** ఓవైపు ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలతో పాటు భారత్ కూడా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కు కొరత రాకుండా పలు నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికే చమురు శుద్ధి సంస్థలపై ప్రభుత్వం నిత్యావసర సరకుల చట్టం- 1955 ను ప్రయోగించింది. అలాగే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతం ఉన్న 21 రోజుల నుండి 25 రోజులకు పెంచింది. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ విక్రయాను అరికట్టేందుకు

2లో..

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

- కేబినెట్ సబ్ కమిటీ కీలక సమావేశం
- 'తెలంగాణ బ్రాండ్' ప్రతిబింబించేలా ప్రతిష్ఠాత్మక ఏర్పాట్లు
- జూన్ 26 నుంచి జూలై 27 వరకు పుష్కరాలు
- పుష్కరాల ఏర్పాట్లలో రాజీపడే ప్రసక్తేలేదు



**హైదరాబాద్** గోదావరి నదీ పుష్కరాల కోసం తెలంగాణ ప్రభుత్వం కసరత్తులు ముమ్మరం చేస్తోంది. వచ్చే ఏడాది జూన్ 26వ తేదీన ప్రారంభమై జూలై 7వ తేదీతో ముగియనున్న గోదావరి పుష్కరాల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు కాగా తాజాగా హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రుల సమావేశం జరిగింది. కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.మరీ ముఖ్యంగా గోదావరి నదిపై ఉన్న పుష్కర ఘాట్లను అభివృద్ధి చేయడం పుష్కర ఘాట్లకు వెళ్లే రోడ్లు వేయడం, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుగానే ప్రణాళికలు తయరు చేసుకోవాల్సిన అవసరాన్ని మంత్రులు ప్రస్తావించారు. గోదావరి పుష్కరాలను అత్యంత

2లో..

# వార్ ఎఫెక్ట్...
# తగ్గిన యూరియా ఉత్పత్తి

అదిలాబాద్ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా కొరత తప్పదని, వ్యవసాయ రంగంపై దీని ప్రభావం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా దాడులు చేస్తున్నాయి. ఇరానే సైతం ప్రతిదాడులకు దిగుతుండటంతో భీకర యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధం ఎఫెక్ట్ మిగతా ప్రపంచ దేశాలపై పడుతోంది. తాజాగా.. రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా ఉత్పత్తిపై యుద్ధం ప్రభావం చూపుతోంది. ఈ కార్మాగారం పూర్తిగా గ్యాస్ ఆధారితంగా పనిచేస్తుంది. పశ్చిమాసియా దేశాల నుంచే ఇక్కడకు గ్యాస్ సరఫరా అవుతోంది. ప్రస్తుతం కర్మాగారానికి గ్యాస్ కొరత ఏర్పడటంతో ఈ నెల 6 నుంచి ఉత్పత్తి సామర్థ్యాన్ని అధికారులు సగానికి తగ్గించారు. సరఫరాలో అంతరాయం ఇలాగే కొనసాగితే యూరియా ఉత్పత్తి మరింత క్షీణించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.రామగుండం కర్మాగారం రోజువారీ యూరియా ఉత్పత్తి లక్ష్యం 3,850 టన్నులు. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఉత్పత్తిని సగానికి తగ్గించారు. ఇక్కడి విద్యుదుత్పాదక కేంద్రం కూడా గ్యాస్ ఆధారంగానే నడుస్తోంది. దీంతో విద్యుదుత్పత్తి కూడా నిలిచిపోనుంది. ప్రత్యామ్నాయ అత్యవసరాలకు ఎన్‌పీడీసీఎల్ విద్యుత్తును వినియోగంలోకి తెచ్చుకునే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గత ఐదు నెలలుగా ఎలాంటి అంతరాయాలు లేకుండా ఆర్ఎఫ్‌సీఎల్‌లో యురియా ఉత్పత్తి కొనసాగుతుండగా.. ప్రస్తుతం నిలిపివేయాల్సిన పరిస్థితులు రానున్నాయనే అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా వార్షిక ఉత్పత్తి టార్గెట్ 12.7 లక్షల టన్నులు. ఈ ఏడాది ప్రారంభంలోనే అత్యధిక కాలం ఫ్యాక్టరీ షట్‌డౌన్‌లోనే ఉంది. దీంతో ఫిబ్రవరి నెలాఖరు వరకు 8.5 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఈనెల 6 వరకు 1,800 టన్నుల యూరియా ఉత్పత్తి నమోదైంది. దేశవ్యాప్తంగా గ్యాస్ ఆధారిత ఎరువుల కర్మాగారాల్లో ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. యూరియా ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం రైతులపై పడే అవకాశం ఉంది. రైతులు ఖరీఫ్ సీజన్ సాగు కోసం సిద్ధమవుతున్నారు. మరో 3 నెలల్లో సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో యూరియా కొరత ఏర్పడితే సాగు కష్టమవుతుందని.. అన్నదాతలకు కష్టాలు తప్పేలా లేవని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# హెచ్ బీ కాలనీలో
# ఎల్ఐజీ, ఎంఐజీలు

హైదరాబాద్ పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసే దిశగా తెలంగాణ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ శివారులో ఎల్ఐజీ, ఎంఐజీ( వర్గాలకు తక్కువ ధరలకే ఇళ్లను కట్టించి ఇవ్వడానికి ప్రణాళికలు రచిస్తోంది. అందుకు కావాల్సిన స్థలాలపై తాజాగా హౌసింగ్ బోర్డు దృష్టిసారించింది. ఈనెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలోని హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ గోడలను నిర్మించాలని డిసైడ్ అయింది.ఈ 11 రోజుల్లోనే ఆయా పేద, మధ్యతరగతి ప్రజలకు స్థల సేకరణ, ఇళ్ల నిర్మాణంపై డీపీఆర్ తయారీకి ప్రణాళిక రూపొందించనుంది. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5 నుంచి 14 వరకు కేటాయింపుదారులతో కాలనీల వారీగా అధికారులు సమావేశాలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 23 వరకు గ్రీవెన్స్ కాల్ సెల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఎఫర్డబుల్ హౌసింగ్ పాలసీని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా మార్గదర్శకాల ముసాయిదాను సర్కార్ రూపొందించనుంది. పాలసీ రూపకల్పనకు 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ద్వారా ఇప్పటికే సీబీఆర్ఐ కన్సల్టెన్సీ సంస్థను సైతం ఎంపిక చేసింది.తెలంగాణ రైజింగ్ విజన్–2047లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిలో పేదలు, మధ్యతరగతి వారికి ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం మూడు దశల్లో ఈ ఇళ్ల సముదాయాలను నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ ఫోర్త్ సిటీలోనూ పెద్దఎత్తున గృహ సముదాయాల నిర్మాణాన్ని చేపట్టనుంది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ తక్కువ ఆదాయ, మధ్య తరగతి పరిధిలోకి వచ్చే జనాభా ఎక్కువగా ఉంటున్నారు. వీరికి కూడా సొంత ఇల్లు కొనుక్కోవాలనే కోరిక ఉన్నప్పటికీ.. అక్కడ కూడా ధరలు భారీగా పెరిగిపోవడంతో అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. అందుబాటు ధరలో ఇళ్లు, ఫ్లాట్ల ఉంటే వీరి సొంతింటి కలను నిజం చేసుకోవచ్చు.ఈ మేరకు టైర్ –2 పట్టణాల్లోనూ ఇళ్ల టవర్లను ఏర్పాటుచేసేలా సర్కార్ మార్గదర్శకాలను రెడీ చేస్తోంది. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో గృహనిర్మాణశాఖ స్థలాలను ఇప్పటికే గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల సముదాయాలు నిర్మించి అల్ప ఆదాయ, మధ్యతరగతి వారికి తక్కువ ధరలకే అందించాలని సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది

## భారీగా సోలార్ ఉత్పత్తికి సింగరేణి ప్రణాళికలు

అదిలాబాద్ పర్యావరణహిత గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కార్మికుల నివాస గృహాలపై రూఫ్ టాప్ సౌర ఫలకాలను ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు రూ. 65 కోట్ల వ్యయంతో 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సంస్థపై ప్రతి నెలా పడుతున్న రూ. 50–60 కోట్ల విద్యుత్ బిల్లుల భారం కొంత మేర తగ్గనుంది.సింగరేణి సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా సింగరేణి ఏరియాల్లోని కార్మికుల నివాస గృహాలపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అనువైన నివాస గృహాలను గుర్తించేందుకు ఆరు నెలల క్రితమే సింగరేణి అధికారులు సర్వే నిర్వహించారు. ఎక్కడైతే చెట్లు, నీళ్ల ట్యాంకులు లేకుండా ఖాళీగా నివాస గృహాలు ఉన్నాయో.. వాటిపై ఈ ప్యానళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యం గతేడాది డిసెంబర్‌లో ఓ సంస్థతో అగ్రిమెంట్ సైతం కుదుర్చుకుంది. పదేళ్లపాటు ఈ సంస్థనే కార్మికుల ఇళ్లపై సోలార్ నిర్వహణ బాధ్యత చేపట్టనుంది.సింగరేణి క్వార్టర్లలో కార్మికుల గృహ విద్యుత్తు వినియోగానికి ప్రస్తుతం నెలకు సుమారుగా రూ.50 నుంచి 60 కోట్ల మేర చెల్లిస్తోంది. రూఫ్ టాప్ సౌర విద్యుత్తుతో సింగరేణికి ఆ భారం చాలా వరకు తగ్గనుంది. అన్ని ఏరియాల వ్యాప్తంగా 15 వేల కిలోవాట్ల మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంస్థ టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందు కోసం రూ.65 కోట్ల ఖర్చు చేయనుంది. ఉద్యోగుల గృహాలకు వినియోగించగా మిగిలిన మొత్తాన్ని గ్రిడ్‌కి అనుసంధానించనున్నారు. ఈ మేరకు 800 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా ఇప్పటికే పలు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లా?ంట్ల ద్వారా ప్రస్తుతానికి 500 మెగావాట్ల వరకు లక్ష్యాన్ని సాధించింది. రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని మణుగూరు వర్క్‌షాపు డీజీఎం శ్రీకాంత్ తెలిపారు. సౌర ఫలకలు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు.కాగా, సింగరేణి సంస్థ చేపట్టిన ఈ రూఫ్ టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా.. ప్రతి నెలా కార్మికుల గృహ విద్యుత్ వినియోగం కోసం సంస్థ వెచ్చిస్తున్న రూ. 50 నుంచి 60 కోట్ల భారం గణనీయంగా తగ్గుతుందని చెబుతున్నారు. 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా సంస్థకు దీర్ఘకాలికంగా ఆర్థిక పొదుపు చేకూరుతుందని అంటున్నారు. పర్యావరణ పరంగా చూస్తే.. బొగ్గు ఆధారిత విద్యుత్తుపై ఆధారపడటం తగ్గి, కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని..ఇది గ్రీన్ ఎనర్జీ లక్ష్యానికి దోహదపడుతుందని వెల్లడిస్తున్నారు. గృహ అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా అదనపు శక్తి వనరుగా మారుతుందని చెబుతున్నారు. ఇది సంస్థ ఆర్థికాభివృద్ధికే కాకుండా.. సింగరేణిని పర్యావరణ హితమైన తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు.

## మునిసిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

తిరుపతి తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరిగాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టాయి. డిప్యూటీ సిటీ ప్లానింగ్ కార్యాలయంలో సిబంధిని విచారించారు. నగదు, పలు ఫైల్స్ ను స్వాధీనం చేసుకున్నారు.

# సీఆర్డీయే ఆధారిటీ సమావేశం

అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ 59వ సమావేశం జరిగింది. ఈ భేటికి పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏడీసీఎల్ విభాగాలకు చెందిన అధికారులు హజరయ్యారు వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, జీవోఎంల నిర్ణయాలు, సచివాలయం, హెచ్వోడీ భవనాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చ జరిగింది. ఈపీసీ పద్ధతిన తెలుగు కల్చరల్ సెంటర్ ఏర్పాటుపై సమీక్ష జరిగింది. రాజధాని పరిధిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణంపై కుడా చర్చ జరిగింది.

# గ్రేటర్ లో పట్టు సాధ్యమేనా

హైదరాబాద్ తెలంగాణ రాజకీయాలకు గుండెకాయ వంటి హైదరాబాద్‌లో ఇప్పుడు ముందస్తు రాజకీయ వేడి రాజుకుంది. మొన్నటి వరకు ఒకే గొడుగు కింద ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పుడు మూడు ముక్కలు (హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్) కావడంతో, పాత సమీకరణాలు చెదిరి కొత్త పొత్తులు, ఎత్తుగడలకు తెరలేచింది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీల మధ్య నలిగిపోతున్న భారత్ రాష్ట్ర సమితి నేతలు ఇప్పుడు తమ రాజకీయ భవిష్యత్తు కోసం పక్కచూపులు చూస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ని మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించాలని నిర్ణయించడం ఈ మొత్తం గందరగోళానికి ప్రధాన కారణం. 150 డివిజన్లతో హైదరాబాద్, 74 డివిజన్లతో మాల్కాజిగిరి, 76 డివిజన్లతో సైబరాబాద్ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం డివిజన్ల సంఖ్య 150 నుంచి 300కి పెరగడం, సరిహద్దుల పునర్విభజన జరగడంతో చాలామంది సిట్టింగ్ కార్పొరేటర్లకు తమ పట్టున్న ప్రాంతాలు చేజారుతాయనే భయం పట్టుకుంది. ఈ రీ–ఆర్గనైజేషన్ వల్ల గ్రామీణ ప్రాంతాలు పట్టణ కార్పొరేషన్లలో కలవడంతో ఓటు బ్యాంకు సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి.2016 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 99 సీట్లు, 2020లో 56 సీట్లకు పరిమితమైంది. ఒకప్పుడు జీహెచ్ఎంసీపై తిరుగులేని ఆధిపత్యం చలాయించిన బిఆర్ఎస్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతూ వస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆ పార్టీలో నైతిక స్థైర్యం దెబ్బతింది.ఈ తరుణంలో కాంగ్రెస్, బీజేపీలు కలిసి 'ఆపరేషన్ ఆకర్ష్'కు పదును పెట్టాయి. అధికారంలో ఉండటం వల్ల నిధుల కేటాయింపు, అభివృద్ధి పనుల ఆశ చూపి నేతలను ఆకర్షిస్తోంది. ఇప్పటికే మేయర్, డిప్యూటీ మేయర్ వంటి కీలక నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడం పార్టీకి పెద్ద దెబ్బ. పట్టణ ప్రాంతాల్లో తమకున్న పట్టును మరింత పెంచుకోవాలని బీజేపీ చూస్తోంది. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవడం ఆ పార్టీకి కొండంత బలాన్నిచ్చింది. గులాబీ పార్టీ నుండి అసంతృప్త నేతలను చేర్చుకుని, 300 డివిజన్లలో బలమైన అభ్యర్థులను నిలబెట్టాలని కమలనాథులు భావిస్తున్నారు.ప్రస్తుతం ఉన్న కార్పొరేటర్లు, టికెట్ ఆశావహులు తమ అనుచరులతో మంతనాలు జరుపుతున్నారు. "గులాబీ పార్టీలో ఉంటే భవిష్యత్తు ఉంటుందా? లేక కాంగ్రెస్, బీజేపీలలో చేరి టికెట్ హామీ పొందాలా?" అనే సందిగ్ధంలో వారున్నారు. మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారం నాటికి మెజారిటీ నేతలు తమ పార్టీ మార్పుపై ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు బీఆర్ఎస్ కేడర్‌ను కాపాడుకోవడం ఆ పార్టీకి ఇప్పుడు కత్తిమీద సామేనని చెప్పొచ్చు. కొత్త అభ్యర్థులను వెతుక్కోవడం, ఉన్నవారిని బుజ్జగించడం నాయకత్వానికి సవాలుగా మారింది. ప్రభుత్వం ఉన్నప్పటికీ, హైదరాబాద్ నగర పరిధిలో క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం బలహీనంగా ఉంది. వచ్చే 'రెడీమేడ్' నేతలే వీరికి ఆధారం. ఇక పట్టణ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నా, 300 మంది సమర్థవంతమైన అభ్యర్థులను వెతకడం వారికి పెద్ద టాస్క్.మొత్తానికి గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ చదరంగంగా మారింది. మూడు కార్పొరేషన్ల ఏర్పాటు కేవలం పాలనా సౌలభ్యం కోసమేనా లేక రాజకీయంగా గులాబీ పార్టీకిను దెబ్బతీయడానికా అన్నది పక్కన పెడితే.. ఈ వలసల పర్వం మాత్రం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రిహార్సల్స్‌గా మారనున్నాయి.

## నాగర్కర్నూల్లో వేలాది కోళ్లు మృత్యువాత

నాగర్ కర్నూలు నాగర్ కర్నూలు జిల్లా లో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడ్డాయి. సోమవారం ఒకేరోజు 10 వేల కోళ్ల మృతి చెందాయి. అంతు చిక్కని వైరస్ జిల్లా పౌల్ట్రీ రైతులను వణికిస్తుంది. పెద్దకొత్తపల్లి, నాగర్కర్నూల్ మండలాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఫోరెన్సిక్ నిపుణుల బృందం విచారణ కోసం రంగంలోకి దిగింది. రైతులు మాత్రం బర్డ్ ఫ్లూగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# వినాయక విగ్రహాంన్నీ ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు

పల్నాడు నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో సోమవారం గుర్తు తెలియని దుండగులు వినాయక స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహాన్ని పీకలించి, గుడి సమీపంలో పారవేసినట్లు స్థానికులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో పూజించే స్వామివారి విగ్రహాన్ని అవమానించడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

## హైదరాబాద్ హైవేపై వేగంగా వచ్చిన కారు ఢీకొని ఇద్దరు గాయాలు

నల్గొండ నల్గొండహైదరాబాద్ హైవేపై వేగంగా వచ్చిన కారు ఢీకొని ఇద్దరికి గాయాలు అయ్యాయి. నల్గొండహైదరాబాద్ హైవేపై ఉన్న అన్లిమిటెడ్ షాపింగ్ మాల్ సమీపంలో వేగంగా వచ్చిన కారు రోడ్డు ఊడుస్తున్న మున్సిపల్ శానిటేషన్ కార్మికులను ఢీకొట్టింది. ఈ ఘటన సీసీటీవీలో నమోదైంది.ఈ ప్రమాదంలో ఒక మహిళా శానిటేషన్ కార్మికురాలి రెండు కాళ్లు విరిగినట్లు సమాచారం. అదే సమయంలో స్కూటర్పై వెళ్తున్న యువకుడిని కూడా కారు ఢీకొట్టడంతో అతనికి తీవ్ర తల గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారును నడిపిన డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## గండిపేటలో బీఆర్ఎస్ ఒక్కరోజు వర్క్ షాపు

రంగారెడ్డి గండిపేటలోని గోల్కొండ రిసార్ట్లో నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఒకరోజు వర్క్ షాపు నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్ రావు హాజరు అయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేసారు. సభలో లేవనెత్తాల్సిన ప్రజా సమస్యలు, నియమనిబంధనలు (రూల్ బుక్), రాజ్యాంగ అంశాలపై అవగాహన కల్పించారు. వర్క్ షాపును కేటీఆర్ ప్రారంభించగా హరీష్ రావు ముగింపు సమావేశంలో కీలక సూచనలు చేసారు.

# వినాయక ఆలయంలో చోరీ

సంగారెడ్డి సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్ వినాయక ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ వెలుగుచూసింది. ఆలయం తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు సుమారు 6 తులాల బంగారు ఆభరణాలు, 8 కిలోల వెండి, ఆలయ హుండీని పగులగొట్టి, 90,000 రూపాయల నగదును దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు,ఇతర ఆధారాలను సేకరిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

# ఆ క్వారీ నాది కాదు

### బీఆర్ఎస్ వి చిల్లర ఆరోపణలు మంత్రి పొంగులేటి

హైదరాబాద్ బిఆర్ఎస్ నేతల విమర్శల పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఓఆర్ఆర్ పక్కన సంబంధం లేని క్రషర్ నాదని పిచ్చి కుక్కలు చాలా మొరుగుతున్నాయి. నాపై మొరిగే కుక్కను ఏ గొలుసుతో కట్టేయాలో నాకు తెలుసని అన్నారు. ఆ క్వారీ నాదని చిల్లర ఆరోపణలు చేస్తున్నారు. నాకు క్రషర్ నడిపే ఓపిక లేదు..

అది నా క్రషర్ కాదు. బిఆర్ఎస్ నేతలు చెబుతున్నది తిరుమల క్రషర్. వేస్ట్ క్రష్ చేసి సప్లై చేసే లైసెన్స్ వారికి ఉంది. ఆ క్రషర్ కంపెనీ మా కంటైనర్ తీసుకువెళ్ళింది. దాని పై ఉన్న పేరును తొలగించినట్లు ఉన్నారు. దానిని పట్టుకుని పిచ్చి వాగుడు వాగుతున్నారు. వెలుగు పట్లలో 410 మంది నిజమైన వారు ఉన్నారు.. 330మంది బోగస్ అని తేలింది. 410 మందికి త్వరలోనే స్థలాలు ఇండ్లు ఇస్తాం. నా పై పిచ్చి మాటలు మాట్లాడుతున్న వారికి అసెంబ్లీలో గట్టిగా సమాధానం చెబుతానని అన్నారు..

# కొత్త గవర్నర్ కు ఘన స్వాగతం

హైదరాబాద్ రాష్ట్ర నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్న స్వాగతం పలికారు. అయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి శ్రీధర్ బాబు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు అయనకు స్వాగతం పలికారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్

న్యూఢిల్లీ / హైదరాబాద్ తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో మలుపు చోటు చేసుకుంటోంది. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారిని విదేశాల నుంచి రప్పించిన సిట్ అధికారుశ్రీ వారిపై అనేక కేసులు పెట్టి నిందితుల జాబితాలో చేర్చారు. అయితే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ జరుగుతుండగానే కీలక పరిణామం చోటుచేసుకుంది.మాజీ ఐపీఎస్ అధికారి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ప్రభాకర్ రావుకు బిగ్ రిలీఫ్ లభించింది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు తాజాగా ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ప్రభాకర్ రావుకు అరెస్ట్ నుంచి మినహాయింపు కల్పిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు చేస్తున్న దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావుకు సూచించింది. దీంతో ఈ కేసులో ప్రభాకర్ రావుకు అరెస్ట్ భయం నుంచి విముక్తి లభించనుంది.ఇక ఈ కేసులో సాక్ష్యాలను గానీ ఆధారాలను గానీ ట్యాంపర్ చేసినా, చేసేందుకు ప్రయత్నించినా తాము మంజూరు చేసిన ముందస్తు బెయిల్ రద్దు అవుతుందని ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేసింది. అదే సమయంలో సుప్రీంకోర్టు అనుమతి లేకుండా తెలంగాణ, దేశం దాటేందుకు వీలు లేదని ప్రభాకర్ రావుకు సూచించింది. ఈ కేసులో సాక్షులుగా ఉన్న వారిని ప్రభావితం చేసినా బెయిల్ రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు పర్మిషన్ లేకుండా ఎక్కడికీ వెళ్లకూడదని ప్రభాకర్ రావుకు తెలిపింది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో గత ప్రభుత్వంలో పోలీస్ ఉన్నతాధికారులుగా పనిచేసిన కొందరిపై సిట్ అధికారులు కేసులు నమోదు చేశారు. అందులో ప్రభాకర్ రావుతోపాటు ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్న ఉన్నారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించిన ప్రభాకర్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసులో పలు సంచలన ఆరోపణలను సిట్ అధికారులు మోపారు.

## నూతన గవర్నర్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఘన స్వాగతం

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా మంగళవారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతోపాటు పలువురు ఉన్నతాధికారులను ఆయనకు సీఎం పరిచయం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల గవర్నర్‌లను కేంద్రం ఇటీవల బదిలీ చేసింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయ్యారు. జిష్ణుదేవ్ వర్మ స్థానంలో తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. ఇటీవల వరకు హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ఉన్నారు. తాజాగా ఆయనను తెలంగాణ గవర్నర్‌గా కేంద్రం నియమించింది. దీంతో శివ ప్రతాప్ శుక్లా దంపతులు మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

## ఇరాన్, అమెరికా యుద్ధంతో గ్యాస్ కొరత

న్యూఢిల్లీ ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో వంట గ్యాస్ కొరత ఏర్పడి బెంగళూరు, ముంబై, ఢిల్లీ, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో హోటళ్లు తాత్కాలికంగా మూతపడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్ల సరఫరా చాలా వరకు తగ్గిపోయింది. దీంతో ఆయా నగరాల్లో రెస్టారెంట్లు, హోటళ్లు మూతపడుతున్నాయి. సిలిండర్ల కొరత కారణంగా హోటల్స్, రెస్టారెంట్ల యాజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. గ్యాస్ ఎక్కువగా అవసరమయ్యే ఫలహారాలను తమ మెనూ జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఉదాహరణకు దోశ, మైసూర్ బజ్జీ, వడ వంటి వాటిని మెనూ నుంచి తొలగిస్తున్నారు. వాటికి బదులు శాండ్ విచ్ వంటి ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఓవెన్‌తో అందించే ఫలహారాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా మెనూలో మార్పులు చేస్తున్నామని హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు చెబుతున్నారు. దోశ, వడ వంటి పదార్థాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. అధిక గ్యాస్ వినియోగమయ్యే ఫలహారాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

## మూసీలో నిత్యం మంచినీటి ప్రవాహం

చరిత్రపై ప్రదర్శనశాల, కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఈ టవర్‌పై 35–50 మీటర్ల ఎత్తున గాంధీ విగ్రహం కొలువుదీరనుంది. గాంధీ విగ్రహం వెనుక లండన్ థేమ్స్ నది ఒడ్డున కనిపించే 'లండన్ ఐ'ను పోలిన రంగుల రాట్నం ఏర్పాటు చేయనున్నారు. గాంధీ స్మృతుల్లో ఒకటైన చరఖాను తలపించేలా ఈ నిర్మాణం కనిపించనుంది. పక్కనున్న 98 ఎకరాల డిఫెన్స్ భూములను సేకరించే ప్రక్రియ ప్రస్తుతం పురోగతిలో ఉందని అధికారులు చెబుతున్నారు.మూసీలో నిత్యం మంచినీటిని ప్రవహింపజేయడంతోపాటుగా నదికి రెండు వైపులా ఉన్న పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు మట్నత్తంగా 15 వంతెనలు నిర్మిస్తారు. ఒకవైపు 100 అడుగుల రోడ్డు, మరోవైపు 80 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. దాంతో పాటుగా కాలిబాట, సైక్లింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తారు. నదిలో పూడికను తొలగించి, అంచులను సరిచేసి కొన్ని ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. పిల్లల పార్కులు, హోటళ్లు, వేడుకలు నిర్వహించుకునేలా యాంఫీ థియేటర్లు ప్రాజెక్టులో భాగం కానున్నాయి. మూడు, నాలుగు చోట్ల చిన్నపాటి ఆనకట్టలనూ కూడా నిర్మిస్తారు. గాంధీ సరోవర్‌లో బోటింగ్ సదుపాయం కూడా ఉండనుంది.

## కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయాలు

కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక మరోవైపు ఐదు రాష్ట్రాల ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర కేబినెట్ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తాజాగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాదాపు రూ.8.80 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు.'జల్ జీవన్ మిషన్ 2.0'ను 2028 డిసెంబర్ వరకు పొడిగించారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 8.7 లక్షల కోట్లను కేటాయించింది. ఈ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటికే 81 శాతం గ్రామీణ గృహాలకు కుళాయి కనెక్షన్లు అందాయి. రెండో దశలో భాగంగా మిగిలిన ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం, అలాగే మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారించనున్నారు. అలాగే తమిళనాడులోని మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ఎయిర్ పోర్టుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరం పుణ్యక్షేత్రాలకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని కేంద్రం భావించింది. దాంతోపాటు రైల్వేలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 4,474 కోట్ల వ్యయంతో రెండు ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇక మధ్యప్రదేశ్ లో కొత్తగా 4 లేన్ కారిడార్ నిర్మాణానికి సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇవే కాకుండా ఎన్నికల నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీఎం ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. మంత్రులతో చర్చించి గోదావరి నది ప్రాంత సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు ఛైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేశారని తెలిపారు.ఇక ఈ గోదావరి పుష్కర ఏర్పాట్లలో రోడ్లు భవనాలు శాఖ కీలక భూమిక పోషించనుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఆధ్యాత్మికతకు, టెంపుల్ టూరిజానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని వివరించారు. గోదావరి నది మహారాష్ట్రలో పుట్టినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రంలోనే అధికంగా నది పరివాహకం ఉంటుందని వెల్లడించారు. 26–6–2027న గోదావరి పుష్కరాలు మొదలై 7–7–2027 వరకు కొనసాగుతాయని అన్ని శాఖలు, విభాగాలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.గోదావరి నది నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద తెలంగాణలోకి అడుగుపెట్టి భద్రాచలం వరకు ప్రవహిస్తుంది.

ఈ వందల కిలోమీటర్ల మేర గోదావరి నది ప్రవహిస్తూ బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం వంటి ఎంతో చరిత్ర కలిగిన ఆలయాలు, ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాల మీదుగా పయనిస్తుంది. ఇక కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరించే పవిత్రనది గోదావరి కాగా దీన్ని తెలంగాణ గంగా నదిగా పిలుస్తారు. ఈ నేపథ్యంలోనే గోదావరి పుష్కరాలకు అంతే స్థాయిలో నిర్వహించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు. పుష్కరాలకు భక్తులు మరింత సౌకర్యవంతంగా చేరుకునేలా రోడ్లు, భవనాలు శాఖ అన్ని రకాల ప్లాన్లను రెడీ చేస్తోంది.హ్యామ్ మోడల్ రోడ్ల కనెక్టివిటీతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కాంక్రీట్ రోడ్లు, పుష్కర ఘాట్లు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళుందని మంత్రులు వివరించారు. గత అనుభవాల దృష్ట్యా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని మంత్రులు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన పుష్కర ఘాట్లు, ఘాట్లకు వెళ్లేందుకు రోడ్లు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. మరీ ముఖ్యంగా కోట్లలో వచ్చే భక్తులతో రద్దీ ఏర్పడుతుందని అందుకే వాహనాల రాకపోకలు, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌పై దృష్టి పెట్టాలని మంత్రులు పేర్కొన్నారు.

## నేటి నుండి ఆన్లైన్లోనే

# ఇసుక పంపిణీ

**- జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్**



**కల్వకుర్తి మార్చి 10 (అక్షర గళం)** నాగర్ కర్నూల్ జిల్లాలో ఇసుక పంపిణీని పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే నిర్వహించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం ఆదేశించారు. జీపీఎస్ ఉన్న మైనింగ్ వాహనాల ద్వారానే రవాణా జరగాలని, అక్రమంగా ఇసుక తరలిస్తే రూ.20 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రజలు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఇసుక పొందాలని ఆయన సూచించారు.ప్రజలు ఇసుక కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని పొందే విధంగా ప్రతి తాసిల్దార్ చర్యలు ప్రజల అవసరాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కూడా ఆన్‌లైన్ ద్వారానే పంపిణీ చేయాలన్నారు.ఇసుక పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన చేశారు.ట్రాక్టర్ యాజమాన్యాలు వాహనాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేస్తే ప్రాధాన్యత ఉంటుందన్నారు.జీపీఎస్ కలిగిన, మైనింగ్ శాఖ వద్ద రిజిస్టర్ అయిన వాహనాల ద్వారానే ఇసుక రవాణా జరుగుతున్న తెలిపారు.జిల్లాలోని 18 ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రతి మండల తాసిల్దార్ ను ఆదేశించారు.పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల పర్యవేక్షణలో ఇసుక రీచ్‌లు నిర్వహణ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక లోడింగ్ జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి

## చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**జీడిమెట్ల సీఐ మల్లేష్**



**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జీడిమెట్ల సీఐ మల్లేష్ సూచించారు.యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు వాటి వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు చింతల్‌లోని భాగ్యరధి డిగ్రీ కాలేజ్లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సీఐ మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన అలవాట్లు అని ఆయన పేర్కొన్నారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యానికి, కుటుంబానికి , సమాజానికి కలిగే నష్టాల గురించి వివరించారు. డ్రగ్స్ వినియోగంపై పోలీసులు తీసుకుంటున్న చర్యలను కూడా తెలియజేశారు. కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాయుడు, డిఐ ధనుంజయ్ వారి బృందం, కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ , బీకాం, బీఎస్సీ, బీబీఏ విద్యార్థులు, బోధన బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## జనజీవన స్రవంతిలోకి మావోయిస్టు దంపతులు



కల్వకుర్తి మార్చి 10 (అక్షర గళం) కల్వకుర్తి మండలం పరిధిలోని ఎల్లికల్ గ్రామంలో మావోయిస్టు దంపతులు పద్మ యాదగిరి లను మంగళవారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. మూడు దశాబ్దాల అజ్ఞాతవాసం వీడి జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టు కేంద్ర కమిటీలో కీలక బాధ్యతలు నిర్వహించిన వీరు, ప్రభుత్వ పిలుపు మేరకు లొంగిపోయారు. సమావేశాల్లో బిజెపి నాయకులు దుర్గాప్రసాద్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ప్రతి వీధిలో సీసీ రోడ్లు

# వేయడమే మా ప్రజాపాలన లక్ష్యం.

**- మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు రమేష్ నాయక్**



**కల్వకుర్తి మార్చి 10 (అక్షర గళం)** ఊర్కొండ మండలం పరిధిలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు వేయడమే మా ప్రజా పాలన లక్ష్యమని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జర్పులావత్ రమేష్ నాయక్అన్నారు.మంగళవారం ఊర్కొండ మండలం గుండ్లగుంట పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్యా తండాలో సీసీ రోడ్ల పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోని ప్రతి వీధిలో అంతర్గత రోడ్లను సిసి రోడ్లుగా మార్చడమే మా ప్రభుత్వ ధ్యేయమని, అభివృద్ధి అంటూ జరుగుతుందంటే మా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతుందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీ జనంపల్లి అనిరుద్ రెడ్డి ఊర్కొండ మండలానికి అభివృద్ధిలో పెద్దపీట వేస్తున్నారని వారికి మా అభినందనలు, ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన

# మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్







కల్వకుర్తి మార్చ్ 10 (అక్షర గళం) కల్వకుర్తి పట్టణంలోని బలరాం నగర్ కాలనీకి చెందిన శేఖర్ అప్ప తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,శ్రీనివాసులు, గణేష్, రమాకాంత్ రెడ్డి చిన్న రాంరెడ్డి గోరటి శ్రీను నాయకులు ఉన్నారు

## ప్రభుత్వం అభివృద్ధికి, ప్రగతి వైపు

# అడుగులు వేస్తుంది

**- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి**











కల్వకుర్తి మార్చి10 (అక్షర గళం) కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండల పరిధిలో గట్టి ఇప్పలపల్లి గ్రామంలో మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ గా 5 దశల్లో 5 ప్రత్యేక కార్యక్రమాలు 99 రోజులు జరుగుతాయని తెలిపారు. త్వరలోనే తలకొండపల్లి మండల కేంద్రానికి 30 పడకల ఆసుపత్రి మంజూరు చేసేటట్టు చూస్తానన్నారు.మండలానికి రెండు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ మంజూరు అవుతయని పేర్కొన్నారు.రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశుభ్రత ,ఆరోగ్యం, యువత, క్రీడలు విద్య ,పిల్లల భద్రత,డ్రగ్స్ కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం, వ్యవసాయం, మహిళలు ,పర్యావరణం వంటి కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ప్రగతి వైపు అడుగులు వేస్తుందని అన్నారు.మండలంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేడ్ పాఠశాల పనులను పరిశీలించారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి డిప్యూటీ డీఎంహెచ్వో, ఎమ్మార్వో ఎంపీడీవో డాక్టర్లు,స్థానిక సర్పంచులు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట నరసింహ,భాస్కర్ రెడ్డి, తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళ సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం





**వెల్దండ మార్చి 10 (అక్షర గళం)** మహిళ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని లింగారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మహమ్మద్ అన్వీర్ పాష అన్నారు వెల్దండ మండల పరిధిలోని లింగారెడ్డి పల్లి గ్రామంలో మహిళ సంఘం భవన నిర్మాణానికి సర్పంచ్ మహమ్మద్ అన్వీర్ పాష భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలోని అభివృద్ధి పరుస్తానన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోగు రాములమ్మ లింగమయ్య వార్డు నెంబర్ సభ్యులు వట్టెపు అల్లాజి పుష్పమ్మ మల్లేష్ జావిద్ శ్రీనివాసులు జాంగిర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుప్పి రెడ్డి రాఘవరెడ్డి శేఖర్ కాశన్న అంజయ్య జంగయ్య గ్రామపంచాయతీ కార్యదర్శి సురేందర్ రెడ్డి ఏఈ సురేందర్ రెడ్డి జోగు ప్రశాంత్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మాదిగ ఐక్యవేదిక కార్యదర్శి

# దాసరి శివప్రసాద్ జన్మదిన వేడుకలు



వెల్దండ మార్చి 11 (అక్షర గళం) వెల్దండ మండల కేంద్రంలోని మాదిగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాది ఐక్యవేదిక కార్యదర్శి దాసరి శివప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు దాసరి శివప్రసాద్ ను శాలువలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక వ్యవస్థాపకులు కొయ్యల పుల్లయ్య మాదిగ ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పు అంజయ్య ప్రధాన కార్యదర్శి ముంగల్ శెట్టి మల్లేష్ తలారి జంగయ్య కొమ్ము అంజయ్య నల్ల జంగయ్య పోలే అశోక్ ఈదులపల్లి లక్ష్మణ్ ప్రకాష్ ఈదులపల్లి అనిల్ కుమార్ ఈదులపల్లి శ్రీనివాసులు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు

## చెత్త ఆటోలు ద్వారా చెత్తను వేయని కుటుంబాల గుర్తింపు






అక్షర గళం, కుత్బుల్లాపూర్ : గాజులరామరం సర్కిల్ పరిధిలో 99 రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి మంగళవారం 5వ రోజు కార్యకలాపాలలో భాగంగా, చెత్త ఆటోలు ద్వారా చెత్తను వేయని కుటుంబాల గుర్తింపు" కార్యక్రమాన్ని సూరారం గ్రామం, హెచ్ఎంటీ సొసైటీ, షాపూర్‌నగర్, దేవేందర్ నగర్, సుబాష్ చంద్రబోస్ నగర్ కాలనీ , పీపీ నగర్ కాలనీలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్, పారిశుధ్య అధికారులు , సిబ్బంది, కాలనీ నివాసితులు, యుసీడి ఆర్పీలు, ఎస్హెచ్జీ గ్రూపులు , గాజులరామారం సర్కిల్‌లోని కాలనీ సంక్షేమ సంఘాలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో, ఇంటింటికీ చెత్త సేకరణ జరిగింది . పారిశుధ్య కార్మికులకు వ్యర్థాలను అప్పగించని ఇళ్లను గుర్తించారు. వ్యర్థాలను సరైన రీతిలో పారవేయడం , మునిసిపల్ పారిశుద్ధ్య వ్యవస్థలో భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతపై నివాసితులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


## బాలికలు చదువులో ముందుండి అన్నిరంగాలలో రాణించాలి

**- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**




అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి : బాలికలు చదువులో ముందుండి అన్నిరంగాలలో రాణించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఉచితంగా బాలికలకు 100 సైకిళ్లు అందించే కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బాలికలకు సైకిళ్ల ను పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన సహాయ సహాకారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతూ వంద శాతం హాజరు ఉన్న బాలికలకు మంజూరు చేసి, మంగళవారం 21 మంది విద్యార్థినులకు సైకిళ్లను అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఎస్బిఐరీజినల్ మేనేజర్, డిఈఓ విజయ కుమారి, విద్యార్థనులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



కల్వకుర్తి మార్చి 10 (అక్షరం గళం) తలకొండపల్లి మండలం పరిధిలోని గట్టుపల్లి గ్రామంలో మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రభావంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి వచ్చిన కల్వకుర్తి ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో జట్టి రాజశేఖర్ పవన్ వాల్మీకి తదితరులు ఉన్నారు.

## బిజెపిmjrకు శుభకార్య ఆహ్వాన పత్రిక అందజేత




కల్వకుర్తి మార్చి 10 (అక్షర గళం) బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డికి మంగళవారం ఊరుకొండ మండల పరిధిలోని బొమ్మరాజు పల్లి గ్రామ ఉపసర్పంచ్ బోయ తిరుపతి మర్యాదపూర్వకంగా కలిసి తన పిల్లల నూతన పట్టు వస్త్రలాకరణ కార్యక్రమానికి రావలసిందిగా ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చెన్నకేశవులు పాండు పవన్ వాల్మీకి తదితరులు ఉన్నారు

# 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు**



**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో జూన్ 12వ తేదీ వరకు నిర్వహించే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈనెల 12న కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంపై మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే ఉటంకిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు ఏవిధంగా నైతే ప్రామాణికమైన ఫలితాలు అందుతాయో, ఆ కోణంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు , ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12,700 గ్రామా పంచాయతీలు, 110 మున్సిపల్ సంస్థలున్నాయని, వీటన్నింటిలో 15000 మంది ప్రజాప్రతినిధులున్నారని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎం.పీ లు , ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లను కూడా ఆహ్వానించాలని సి.ఎస్ స్పష్టం చేశారు. జిల్లా లోని వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలిపే ఫోటో ప్రదర్శనను కూడా వేదిక వద్ద ఏర్పాటు చేయాలన్నారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ఫైళ్ల క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను రామకృష్ణా రావు అభినందించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

## నేడు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన



**కల్వకుర్తి మార్చ్ 10 (అక్షర గళం):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి బుధవారం కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని కల్వకుర్తి వెల్దండ మండలాలలో పర్యటిస్తారని మంగళవారం ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం నుండి మీడియాకు తెలిపారు. వెల్దండ మండల పరిధిలోని ఉదయం 9:30 గంటలకు శంకర్ కొండ తండాలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత త్రాగునీటి శుద్ధి కేంద్రం (వాటర్ ప్లాంట్) ప్రారంభిస్తారని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కల్వకుర్తి మండల పరిధిలోని తుర్కలపల్లి గ్రామంలో పర్వతాలు కూతురు పుట్టినరోజు వేడుకల్లో మధ్యాహ్నం ఒంటిగంటకు హాజరవుతారని స్థానిక నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులందరూ పాల్గొనాలని కోరారు.

## ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతులుగా జీవిస్తారు

**- పడకల్ గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అవగాహనపై ర్యాలీ**




**కల్వకుర్తి మార్చ్ 10 (అక్షర గళం):** ప్రతి ఒక్కరూ పరిసరాలను సామాజిక బాధ్యతతో పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతులుగా జీవిస్తారని పడకల్ గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అన్నారు పడకల్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వ పాఠశాలలో గ్రామంలోని డ్రైనేజీలు పరిశుభ్రంగా చేసే కార్యక్రమం నిర్వహించి బ్లీచింగ్ పౌడర్ శానిటైజ్ చేయడం కార్యక్రమాలు జరుగుతాయని గ్రామాన్ని ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజులు కార్యాచరణ పనులను నెరవేరుస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకురి ప్రభాకర్ రెడ్డి గ్రామ ఉపసర్పంచ్ జీనుకుంట్ల రాఘవేందర్ గౌడ్ కార్యదర్శి కుమార్ వార్డు సభ్యులు జోగు విజయ్ జిల్లెల్ల సుహాసిని లట్టుపల్లి వసంత రంగారెడ్డి అబ్దుల్ వహీద్ రాధికా రమేష్ బుండ గళ్ళ చందు చెవిటి విమలమ్మ జరిగే నరసింహ చెవిటి విజయ్ కుమార్ గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి సిఐబి నాగార్జునకు శుభకార్య ఆహ్వాన పత్రిక అందజేత




కల్వకుర్తి మార్చి 10 (అక్షర గళం) కల్వకుర్తి సీఐ నాగార్జునకు మంగళవారం కోరుకొండ మండల పరిధిలోని బొమ్మరాజు పల్లి గ్రామ ఉపసర్పంచ్ బోయ తిరుపతి కల్వకుర్తి సీఐ కార్యాలయంలో సీఐ బోయ నాగార్జునను మర్యాదపూర్వకంగా కలిసి తన పిల్లల నూతన పట్టు వస్త్రలాకరణ కార్యక్రమానికి రావలసిందిగా ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చెన్నకేశవులు పాండు పవన్ వాల్మీకి తదితరులు ఉన్నారు

## సీఎం సహాయ నిధి పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు**




**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** సీఎం సహాయ నిధి పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వెంటనే స్పందించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి దాదాపు రూ.7,75,000 లను మంజూరు చేయించగా మంగళవారం ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని మంగళవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు సీఎంఆర్ఎఫ్ సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూం నగర్ కు చెందిన లబ్ధిదారులు బేబీ సిద్రా మహేక్ కు రూ.6.00 (ఆరు లక్షలు), సుభాష్ నగర్ డివిజన్ సూరారం రాజీవ్ గృహకల్ప కు చెందిన లబ్ధిదారులు కొలు పూరి సాయి గిరిజ కు రూ.1.00 (లక్ష రూపాయలు), కుత్బుల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ కు చెందిన లబ్ధిదారులు బాణాల ప్రమీల భర్త ప్రమీల రాం కుమార్ కు రూ.75,000లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగన్, సురేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు నల్ల వేణు, ముంతాజ్అలీ, గుబ్బల లక్ష్మీనారాయణ, కిషోర్ చారి, సదానంద్ చారి, మహమ్మద్ ఆజం, మెట్ల శ్రీను, బొంబాయి శ్రీను, ఎండి. నసీరుద్దీన్, నాగరాజు, కళ్ళెం శ్రీనివాస్, విజయ్, వెంకట్ రెడ్డి, ఆంజనేయులు, రమణా రెడ్డి, వెంకటేష్, రాకేష్ జలిగం, నర్సింహా రెడ్డి, జయం చారి , లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో పాల్గొన్న అధికారులు



**కల్వకుర్తి మార్చ్ 10 (అక్షర గళం):** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం కల్వకుర్తి మున్సిపాలిటీలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి




ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా కల్వకుర్తి ముంచిపాలిటీలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో ఎల్బీ మున్సిపాలిటీ చైర్పర్సన్ వైస్ చైర్పర్సన్ ఏడి రిషి సిడిఎంఎం మున్సిపల్ కమిషనర్ కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ ప్రిన్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల వైస్ చైర్మన్ షాహిద్ మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్ళు శ్రీధర్ రెడ్డి కి నివాళులు అర్పించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి మార్చ్ 10 (అక్షర గళం):** కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కళ్ళు శ్రీధర్ రెడ్డి ద్వాదశదిన కర్మ మంగళవారం హైదరాబాదులో ఒక ప్రముఖ హోటల్లో కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పోలేపల్లి ఉపసర్పంచ్ బుచ్చిరెడ్డి సీనియర్ నాయకులు సుజీవన్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి జాతర మహోత్సవం




**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** కూకట్పల్లి లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి జాతర మహోత్సవం గొల్ల కురుమ సంఘం వారి ఆధ్వర్యంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని స్వామివారి దివ్య దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.ఆలయ పరిసరాల్లో నిర్వహించిన జాతర ఉత్సవాలను పరిశీలించి భక్తులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి పుణ్యక్షేత్రాల అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు , ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలతో వడ్డేపల్లి రాజేశ్వరరావు ని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గొల్ల కురుమ సంఘం నాయకులు నగేష్ యాదవ్, నర్సింగ్ రావు, నర్సింగ్ యాదవ్, గోపాలకృష్ణ కురమ, మల్లేష్ యాదవ్, చైతన్య యాదవ్ మనమ్మ,మల్లమ్మ, లలిత తదితరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నవారిగూడెం చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

జంగారెడ్డిగూడెం చిన్నవారిగూడెం:ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం చిన్నవారిగూడెం గ్రామంలో ఉన్న చెరువులో సోమవారం రాత్రి అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతుండటంతో గ్రామస్తులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులో ఏఅః 205 / 210 ఎక్స్కవేటర్ సహాయంతో మట్టి తవ్వి లారీల ద్వారా తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు.మా ఊరి చెరువు నుంచి మట్టిని ఎందుకు తీసుకెళ్తున్నారు, దీనికి ఎవరు అనుమతి ఇచ్చారు అని గ్రామస్తులు నిలదీయగా మట్టి తరలిస్తున్న వారు రకరకాల అధికారుల పేర్లు, నాయకుల పేర్లు చెబుతూ ఇష్టానుసారంగా మట్టి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.దఈ అక్రమ మట్టి తవ్వకాల వెనుక జంగారెడ్డిగూడెం జనసేన నాయకుడు అయ్యప్ప ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్నప్పుడు టిప్పర్ లారీతో గుద్దిచ్చి చంపేస్తానని బెదిరించిన ఘటనలు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు.రెండు గంటలసేపు లారీలను అడ్డుకున్న గ్రామస్తులుఅక్రమంగా మట్టి తరలిస్తున్న లారీలను గ్రామస్తులు బళ్లారి వద్ద రెండు గంటలపాటు అడ్డుకున్నారు. మా గ్రామ సంపదను ఇతరులు తీసుకెళ్తుంటే మేము చూస్తూ ఊరుకోమని గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామస్తులు, రైతులు కలిసి లారీలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు.**గ్రామస్తులతో వాగ్వాదం** విలేకరులపై దాడికి ప్రయత్నంలారీలు అడ్డుకున్న సమయంలో జనసేన నాయకుడు అయ్యప్ప అక్కడికి చేరుకొని గ్రామస్తులతో కొంతసేపు వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా మాకు ఎమ్మార్వో పర్మిషన్ ఇచ్చారు, మీరు ఏం చేస్తారు అంటూ గ్రామస్తులతో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు.అదే సమయంలో అక్కడ జరిగిన ఘటనలను వీడియోలు తీస్తున్న విలేకరులపై కూడా దాడికి ప్రయత్నిస్తూ బెదిరింపులకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు.**పోలీసులకు సమాచారం** లారీలను స్టేషన్కు తరలింపుగ్రామస్తులు జంగారెడ్డిగూడెం పోలీసులకు, విలేకరులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

# భారీగా ఎన్ డి పి ఎల్ మద్యం పట్టివేత

## రూ.3.68 లక్షల మద్యం స్వాధీనం 18 కేసులు నమోదు




రంగారెడ్డి ఎక్సైజ్ యంత్రాంగం స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ శానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు ఎయిర్పోర్టు నుంచి వస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. ఢిల్లీ గోవా ప్రాంతాల నుంచి వస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఢిల్లీ, గోవా నుంచి మద్యం వస్తున్నట్లుగా సమాచారం రావడంతో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బి, సి అండ్ డి టీముల సిఐలు భిక్షా రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు సిబ్బంది కలిసి రాజీవ్ గాంధీ ఎయిర్పోర్ట్ బయట రోడ్డుపై వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 99 ఢిల్లీ గోవాకు చెందిన మద్యం బాటిల్లను సీజ్ చేశారు. శంషాబాద్ రోడ్డు లో శంషాబాద్ డిటిఎఫ్ సిఐ ప్రవీణ్ కుమార్, శేర్లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ కిరణ్, చేవెళ్ల ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, శంషాబాద్ సిఐ దేవేందర్ రావు సిబ్బంది కలిసి ఎయిర్పోర్టు నుంచి వస్తున్న ఎన్డిపిఎల్ మద్యాన్ని పట్టుకోవడానికి శంషాబాద్ రోడ్ లో వాహనాలను తనిఖీ చేశారు. 85 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. 12 మంది పై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో 1084 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం బాటిల్ల విలువ రూ.3.68 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు.

# వంట సామాగ్రి తీసుకునే అవకాశం కూడా ఇళ్లను కూల్చేశారు

హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ బాధితులు మీడియాతో మాట్లాడారు. నవోదయ కాలని వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితురాలు సలోని మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి ఉంటున్నాం. కనీస సౌకర్యాలు లేవు.. ప్రాచీన యుగంలో బతుకుతున్నట్లు అనిపించేది. మా ఇల్లే మా సర్వస్వం అనుకోని బతికాం.. ఒక్క క్షణంలో జెసిపిలు వచ్చి మా బతుకులు ఛిద్రం చేశాయని ఆరోపించారు. అక్కడ లక్షాధికారులు ఉన్నారని ఆరోపణ చేస్తున్నారు.. పదేళ్లు కనీసం సౌకర్యాలు లేకుండా లక్షాధికారులు అక్కడ ఉంటారా. రాజ్యాంగపరమైన రక్షణలు ప్రతి ఒక్కరికి ఉంటాయి. చట్టం ప్రకారం నడుచుకోవాలి. వెయ్యి కుటుంబాల వరకు ఇక్కట్లు పడుతున్నారు. సుప్రీంకోర్టు కూడా మాకు అనుకూలంగా స్టేటస్ కో జారీ చేసింది. కూలీ చేసే బతికే మా మీద నాలుగు వేల మంది పోలీసులు వచ్చి దౌర్జన్యం చేశారు. కుటుంబానికి పదిమంది చొప్పున పోలీసులు వచ్చి దౌర్జన్యం చేశారు. మేం మీకు గౌరవం ఇచ్చాం.. మేం తిరగబడడానికి ఒక్క క్షణం చాలు. అన్నింటికీ తెగించి పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నమని అన్నారు.తెలంగాణ గడ్డ పోరాటాల అడ్డ. ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రుల గురించి మాట్లాడటం సిగ్గుచేటు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు పార్టీ కండువాలు మార్చారు. మంత్రులు కనీసం పరామర్శించడానికి కూడా రాలేదు. కలెక్టర్ ను వెంటనే సస్పెండ్ చేయాలి. కలెక్టర్ నాలుగడుగులు వేస్తే మా కాలనీ వస్తుంది.. కాని ఇప్పటికీ మొహం చూపించలేదు. మా భూములను మాకు ఇవ్వాలి.. నష్టపరిహారనీ ఇవ్వాలని అన్నారు.అక్తర్ ఉన్నీస బేగం మాట్లాడుతూ కరెంటు, నీళ్లు ఇవ్వాలని కోర్ట్ ఆర్డర్స్ ఉన్నా కనీసం పట్టించుకోవడం లేదు. భూదాన్ భూములు పేదలకు చెందిన భూములు. అక్కడ ఉన్నది పేదల.. కోటీశ్వరుల.. అన్నది ఎంక్వయిరీ చేస్తే తెలిసేది కదా.. అంబేద్కర్ భవన్లో కల్పించిన పునరావాసము కూడా సరిగ్గా లేదు. కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. రెవెన్యూ, మున్సిపాలిటీ, కలెక్టర్ కోర్ట్ ఆర్డర్లను తుంగలో తొక్కారు. భూదాన్ భూములు ఎక్కడున్నాయో చూపించాలి. 250 కోట్ల విలువచేసే 31 ఎకరాలు కాజేసే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తం సుమారు 60 ఎకరాల భూదాన్ భూముల్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం కలెక్టరేట్ నిర్మించారు.. మేం పదేళ్ల నుంచి అక్కడ ఉంటున్నాం. కలెక్టరేట్ వచ్చిన తర్వాత అక్కడ భూమి విలువ పెరగడంతో మమ్మల్ని గెంటేశారు. మా పేదలకు ఇచ్చిన భూదాన్ భూములు ఎక్కడున్నాయో తేల్చాలని అన్నారు. మరో బాధితురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ 2019లో అక్కడికి వెళ్ళాం.. గుట్టలను, రాళ్లు రప్పలను తొలగించి చిన్న ఇల్లు నిర్మించుకున్నాం. మా ఇంటిని నిర్ధాక్షణ్యంగా కూల్చి వేశారు. మేము పేదవారము కాదని అంటున్నారు.. వచ్చే సర్వే చేసుకోవచ్చు. ఆ పిల్లలు చదువులు ఆగమయ్యాయి.. తినడానికి తిండి కూడా లేదు. అది భూదాన్ ల్యాండ్.. అది పేదల హక్కు. మాలాంటి పేదల కోసమే ఆనాడు ఆచార్య వినోబాభావే భూదాన ఉద్యమం చేశారని అన్నారు.చింత అపర్ణ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి అక్కడే ఉంటున్నాం. కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నాం. పొట్ట చేత పట్టుకొని ఖమ్మం వచ్చి బతికిడుస్తున్నాం.భూధన్ భూములను చూపించి గ్రామీణ పేదల సంఘం మాకు అండగా నిలిచింది.అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని సూచించింది.రాత్రికి రాత్రి వచ్చి మాకు నిలువ నీడ లేకుండా చేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ కి వెళ్లి మాకు సౌకర్యాలు కల్పించాలని అర్జీలు ఇచ్చేవాళ్లం. డెంగీ వచ్చి మా పిల్లలు చనిపోతున్నారని కలెక్టర్ కు మొర పెట్టుకున్నాం.. అయినా పట్టించుకోలేదు ముగ్గురు మంత్రుల కన్ను మాలాంటి పేదల గూడు మీద పడింది. మేం ఓట్లు వేస్తే గెలిచిన వాళ్లు మా ఇళ్ళను కూల్చేశారు. కనీసం ఇంట్లోని వస్తువులు తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. వంట సామాగ్రి తీసుకునే అవకాశం కూడా ఇళ్లను కూల్చేశారు వేరేచోట ఇంటి స్థలాలను ఇస్తామని మంత్రులు చెబుతున్నారు.. వేరే చోటికి వెళ్తే మా జీవనాధారం. దెబ్బతింటుంది. మా ఇళ్లను కూల్చి వేసిన చోటే మాకు ఇల్లను నిర్మించి ఇవ్వాలని అన్నారు.

# ఉద్యోగాల పేరిట లక్షలు వసూలుచేసిన వారిని తక్షణ చర్యలు తీసుకోవాలి

**ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ.**

**గౌరవ అధ్యక్షులు: జల్లి రాజబాబు డిమాండ్.**




అల్లూరి నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని, అల్లూరి సీతారామరాజు జిల్లా ఆశ్రమ పాఠశాలలలో సెక్యూరిటీ అటెండర్ ఉద్యోగాలు ఇస్తామని, శ్రీ రక్ష అనే మేన్ పవర్ ఏజెన్సీ కంపెనీ పేరుతో, కొంతమంది ఆదివాసి నిరుద్యోగ యువత దగ్గర 70 వేల నుంచి సుమారు లక్ష రూపాయల వరకు భారీ అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ, గిరిజన సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షులు జల్లి రాజబాబు ఒక ప్రకటనలో తెలిపారు.గిరిజన ప్రాంతాల్లోని అమాయక నిరుద్యోగులే లక్ష్యంగా అక్రమార్కులు రెచ్చిపోతు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 'శ్రీ రక్ష' అనే మ్యాన్ పవర్ ఏజెన్సీ పేరుతో కొందరు వ్యక్తులు భారీ వసూళ్లకు పాల్పడుతు న్నారు. వివరాల్లోకి వెళితే అల్లూరి సీతారామ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశ్రమ పాఠశాలలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయని, త్వరలో భర్తీ చేయనున్నామని చెబుతూ కొంతమంది పాడేరు చెందిన వ్యక్తులు మోసానికి పాలు పడ్డారు . నిరుద్యోగులైన గిరిజన యువతకు మాయమాటలు చెప్పడంతో, వారి మాటలు నమ్మి భూములు, ఆస్తులు, బంగారాలు, అమ్మి నగదు పోగొట్టుకొని . రోడ్డున పడ్డారని అక్రమార్కులు ఒక్కొక్కరి నుంచి రూ.70 వేల నుంచి లక్ష రూపాయలు వరకు తీసుకొన్నారు నిరుద్యోగుల ఆశలతో ఆడుకుంటున్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో మోసపోయిన నిరుద్యోగ యువతతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు అన్నారు.

## పరాకామణిలో బంగారం దొంగతనంపై

# సాక్షి కథనం పూర్తిగా అసత్యం

తిరుమల తిరుమల శ్రీవారి ఆలయంలోని పరాకామణిలో భారీ స్థాయిలో బంగారం దొంగతనం జరిగిందని ఈరోజు సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం పూర్తిగా అసత్యం. వాస్తవాలను వక్రీకరించి రాసిన ఈ కథనాన్ని టీటీడీ తీవ్రంగా ఖండిస్తోంది.వాస్తవానికి, 2025 జనవరి 11న పరాకామణిలో విధులు నిర్వహిస్తున్న ఏబీరిపోస్ సంస్థకు చెందిన ఔట్సోర్సింగ్ సిబ్బంది పెంచలయ్య అనే వ్యక్తి 100 గ్రాముల బంగారు బిస్కెట్ను అపహరించేందుకు ప్రయత్నించినప్పుడు టీటీడీ విజిలెన్స్ మరియు సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా స్పందించి రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఆ వ్యక్తి ఆ బంగారు బిస్కెట్ను ఖాళీగా ఉన్న స్టీల్ హుండీ ట్రాలీలోని పైపు రంధ్రంలో దాచిపెట్టినట్లు సాధారణ భద్రతా తనిఖీలలో గుర్తించారు. ఈ ఘటన సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా నమోదైంది. దాని ఆధారాలు కూడా కోర్టుకు సమర్పించబడ్డాయి.ఈ ఘటనపై టీటీడీ విజిలెన్స్ ఇన్స్పెక్టర్ ఫిర్యాదు మేరకు తిరుమల 1 టౌన్ పోలీస్ స్టేషన్ వారు అతీ.ఔనీ.02/2025, ఃఔా సెక్షన్ 316(5) కింద నాన్-బెయిలబుల్ కేసు నమోదు చేసి నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి 2025 జనవరి 13న నిందితుడిని కోర్టుకు హాజరు పరచగా న్యాయస్థానం అతన్ని జ్యుడీషియల్ రిమాండ్కు పంపింది. నిందితుడు సుమారు 30 రోజులు జ్యూడిషియల్ కస్టడీలో ఉండడం జరిగింది.పోలీసు వారి సమాచారం ప్రకారం సీసీటీవీ ఫుటేజీ సహా అన్ని డిజిటల్ ఆధారాలను 65(ః) ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం ధృవీకరించి కోర్టుకు సమర్పించడం జరిగింది.పోలీసుల దర్యాప్తులో భాగంగా నిందితుడి ఇంటి వద్ద మరియు ఇతర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా ఘటన స్థలంలో 100 గ్రాముల బంగారు బిస్కెట్, ఇంటి సోదాల్లో 555.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 157 గ్రాముల వెండి వస్తువులు, పోలీసు కస్టడీలో అదనంగా 76 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అదనంగా ప్రముఖ జ్యువెలరీ దుకాణాల్లో బంగారం మార్పిడి చేసిన ఇన్వాయిస్ రసీదులు కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో భాగంగా 12 మంది సాక్షులను విచారించి, నిందితుడి ఆర్థిక లావాదేవీలు, బ్యాంకుల్లో బంగారం ముట్టజెప్పిన వివరాలు, ఆస్తులు, బినామీ లావాదేవీలు తదితర అంశాలను కూడా పరిశీలించారు. ఈ ఘటనపై అన్ని ఆధారాలతో చార్జ్షీట్ దాఖలు చేయబడింది. ప్రస్తుతం ఈ కేసు అఅ ఔనీ.309/2025గా న్యాయస్థానంలో విచారణలో ఉంది. తదుపరి విచారణ 2026 ఏప్రిల్ 13న జరగనుంది.చోరీ మరియు అరెస్టుకు సంబంధించిన సదరు విషయాలను అన్ని ప్రసార మాధ్యమాల్లో (ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషియల్ మీడియాలో) నూ కవర్ చేయబడింది.ఈ సంఘటనలో టీటీడీ విజిలెన్స్ మరియు భద్రతా సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి నిందితుడిని వెంటనే పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ ఈ సంఘటనను వక్రీకరించి పరాకామణిలో భారీ స్థాయిలో బంగారం దొంగతనం జరిగినట్లు, కోట్ల విలువైన బంగారం మాయమైందన్నట్లు ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారం. శ్రీవారి ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా భక్తుల్లో అనవసర అపోహలు కలిగించే విధంగా నిరాధార కథనాలు ప్రచురించడం భావ్యం కాదు.పరాకామణి ప్రక్రియలో బహుళస్థాయి భద్రతా వ్యవస్థ, కఠిన నియంత్రణ విధానాలు, సీసీటీవీ పర్యవేక్షణ అమలులో ఉన్నాయని టీటీడీ స్పష్టం చేస్తోంది. కాబట్టి భక్తులు అసత్య ప్రచారాలను నమ్మవద్దని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

# వడదెబ్బతో మరణిస్తే 4 లక్షల పరిహారం

హైదరాబాద్ వడదెబ్బతో మరణించిన వారి కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. 4 లక్షల ఎక్స్రేషియా ప్రకటించింది. హీట్వేవ్, సన్ స్ట్రోక్లను వడదెబ్బను స్టేట్ స్పెసిఫిక్ డిజాస్టర్గా పేర్కొంది. ఎవరైనా వ్యక్తులు వడదెబ్బకు చనిపోయారని అనుమానం వస్తే తప్పనిసరిగా పోస్ట్ మార్టం చేయించాలి. మరణ ధ్రువీకరణ పత్రం, పోస్ట్ మార్టం రిపోర్టుతో దరఖాస్తు చేస్తే అధికారులు పరిశీలిస్తారు. తరువాత నష్ట పరిహారంను చెల్లిస్తారు.


# కరీంనగర్ జిల్లాలో విషాదం?

## భర్త మృతి తట్టుకోలేక భార్య ఆత్మహత్య

కరీంనగర్ జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటు చేసుకుంది. అనారోగ్యంతో భర్త మరణించడంతో తట్టుకోలేకపోయిన భార్య పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది.సోమవారం (మార్చి 9) జరిగిన ఈ ఘటన జిల్లాలోని వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది.మామిడాలపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య, పద్మ భార్యాభర్తలు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శంకరయ్య ఇటీవల మృతి చెందాడు.భర్త మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన భార్య పద్మ తీవ్ర మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.భర్త మృతి తట్టుకోలేకనే పద్మ ఆత్మహత్య చేసుకుందా? లేక వేరే కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీలో పెట్టుబడులకు మంచి వాతావరణం

## ముంబయి పర్యటనలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్




ముంబాయి మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం నాడు 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్ మెంట్ పార్క్ అండ్ ఇండస్ట్రీస్(ఐఏఏపీఐ) ఎక్స్ పోలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏపీ పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఉందని, నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇన్వెస్టర్లకు రాయితీలు కల్పిస్తున్నామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఏపీలో అమ్యూజ్ మెంట్, థీమ్, వాటర్ పార్క్ లు, అడ్వెంచర్ జోన్ల ఏర్పాటుకు ఇన్వెస్టర్లను మంత్రి దుర్గేష్ ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కులు, వాటర్ ఫ్రంట్ అట్రాక్షన్స్,అడ్వెంచర్ జోన్ల ఏర్పాటుకు ఏపీలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. సుదీర్ఘ తీరప్రాంతం, గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉంది. ఏపీలో వినోద రంగాన్ని అభివృద్ధి చేయడానికి అనువైన వాతావరణం ఉందని తెలిపారు. విమానాశ్రయాల విస్తరణ, మెరుగైన రవాణా సౌకర్యాలు, పెరుగుతున్న పట్టణీకరణ ఆంధ్రప్రదేశ్ను పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతంగా మార్చాయి. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దార్శనికతతో మేము 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'ని రూపొందించాం. హోటళ్లు, థీమ్ పార్కులు, రిసార్టుల కోసం భూ కేటాయింపు ప్రక్రియను సరళతరం చేస్తూ దేశంలోనే మొదటిసారిగా ఈ విధానాన్ని తెచ్చామని అన్నారు.

# మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి




హైదరాబాద్: తాజాగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన శ్రీ వేం నరేందర్ రెడ్డి మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఒ పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో ఆయనకు ఉన్న అనుభవం, నిబద్ధత మరియు అంకితభావం తెలంగాణ గళాన్ని దేశ రాజధానిలో బలంగా వినిపించడానికి ఎంతో దోహదపడతాయని మంత్రి ఆకాంక్షించారు.రాజ్యసభలో ఆయన పార్లమెంటరీ ప్రస్థానం విజయవంతంగా సాగుతూ, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## పాఠశాలల అభివృద్ధికి అమరా బచ్చు

# ఛారిటబుల్ ట్రస్ట్ చేయూత

**మంత్రి లోకేష్ ను కలిసిన ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బచ్చు కృష్ణ కుమార్ దంపతులు**

**నెల్లూరు జిల్లా బోగోలు మండలంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.5 కోట్లు సాయం ప్రకటన**




ఉండవల్లి: పేదల సాధికారతకు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పీ-4 కార్యక్రమానికి నెల్లూరు జిల్లా బోగోలుకు చెందిన అమరా ఛారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించనుంది. ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిసిన ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బచ్చు కృష్ణ కుమార్ దంపతులు.. బోగోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.5 కోట్ల సాయం ప్రకటించారు. త్వరలో చేపట్టనున్న ఆయా అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా మన బడి-మన భవిష్యత్ కింద బోగోలు మండలంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపర్చనున్నారు. మన బడి- మన భవిష్యత్తు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రవాస భారతీయులు, పూర్వవిద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోంది. దాతల పేర్లు కూడా ఆయా పాఠశాలలకు పెట్టుకునే అవకాశం కల్పించనుంది. త్వరలోనే మన బడి - మన భవిష్యత్తు వెబ్ సైట్ ను ప్రారంభించనుంది.మరోవైపు బోగోలు మండలం కొవ్వూరుపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రూ.5 కోట్లు, కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.5 కోట్ల సాయాన్ని అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ అందించనుంది.

# కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత

## అందోళనలో హోటల్స్ యాజమాన్యాలు

హైదరాబాద్ హైదరాబాద్ నగరంలో హోటల్ అసోసియేషన్ అత్యవసర సమావేశమయింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లపై ప్రభావం పడనున్న నేపథ్యంలో భవిష్యత్ ప్రణాళిక గురించి చర్చించేందుకు హోటల్స్ యాజమాన్యాలు సమావేశమయ్యారు. ఇప్పటికే బెంగుళూరులో హోటల్స్ యాజమాన్యాలు సమ్మెబాట పట్టగా, కేంద్రానికి చెన్నై హోటల్స్ అసోసియేషన్ లేఖ రాసింది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి తెలంగాణతో పాటు ఇక హైదరాబాద్ లో కూడ రెస్టారెంట్,టిఫిన్ సెంటర్లు బంద్ అవ్వనున్నాయని సమాచారం. ఇప్పటికే కమర్షియల్ గ్యాస్ సరఫరా ను కేంద్రం తగ్గించింది. ముంబయ్, బెంగుళూరు లో ఇప్పటికే కమర్షియల్(హోటల్స్, రెస్టారెంట్స్, టిఫిన్ సెంటర్స్, ఫ్యాక్టరీస్) బిజినెస్ 20% కే పరిమితమయింది. హైదరాబాద్ లో కమర్షియల్ గ్యాస్ కొరత. రోజుకు 5సీలిండర్లు వాడే హోటల్స్ కి ఒక సీలిండర్ డీలర్లు సరఫరా చేస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సప్లయ్ ఆగడంతో బిజినెస్ పై ప్రభావం చూపనున్నాయి. హోటల్స్,టిఫిన్ సెంటర్స్,కరి పాయింట్స్,స్ట్రీట్ ఫుడ్స్ తో పాటు మాన్యుని ఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీలుకుడా ప్రభావితం అవనున్నాయి. అయితే హాస్పిటల్స్, విద్యార్థుల హాస్టల్స్ తో పాటు ముఖ్యమైన వాటికి యధావిధిగా సరఫరా వుంటుంది.

# అలిపిరి తనిఖీ కేంద్రం లో భారీగా నగదు స్వాధీనం



తిరుమల అలిపిరి తనిఖీ కేంద్రం లో భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. భారీ నగదుతో తిరుమలకు వెళ్తున్న వ్యక్తిని టీటీడీ విజిలెన్స్ విచారిస్తున్నారు. 65 లక్షల నగదు తీసుకొచ్చినట్లు సమాచారం. తిరుమలలో కాయిన్స్ కోసం ఈ నగదును తీసుకెళ్తున్నట్లు నిర్ధారించారు. అధిక మొత్తం కావడంతో టీటీడీ విజిలెన్స్ విచారించారు. నగదు తెచ్చిన వ్యక్తిని, నగదును అలిపిరి పోలీసులకు అప్పగించారు. రెగ్యులర్ గా 5 నుంచి 10 లక్షల రూపాయల నగదుతో కాయిన్స్ మార్పు చేసుకుంటూ వచ్చేవాడని తెలుస్తోంది.

# బంద్ దిశగా తెలంగాణ హోటళ్లు

సికింద్రాబాద్ రాష్ట్ర వ్యాప్తంగా బంద్ నిర్వహించే యోచనలో తెలంగాణ హోటల్స్ యాజమాన్యాలు వున్నాయి. కమర్షియల్ గ్యాస్ నిలిపి వేయడంతో నిర్ణయం తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ తీసుకోనుంది. తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ హైదరాబాద్ లో అత్యవసర సమావేశం జరిగింది. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిపివేతతో సమావేశం హోటల్స్ అసోసియేషన్ నిర్వహించింది. ఇప్పటికే బెంగళూరు తో సహా ముంబై నగరాల్లో హోటల్స్ బంద్ నిర్వహిస్తున్నాయి. తమ భవిష్యత్తు కార్యాచరణ పై సమావేశం ఈ సమావేశం ద్వారా తమ సమస్యను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హోటల్స్ అసోసియేషన్ తెలియచేయనుంది తెలంగాణ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ హోటల్స్ పరిశ్రమకు గ్యాస్ ప్రాణవాయువు వంటిది. యుద్ధం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడింది. ఇప్పటికే గ్యాస్ నిల్వలు తగ్గిపోయాయి. హోటళ్లలో వంటలు చేయడం కష్టంగా మారింది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యామ ఏర్పాట్లు చేయాలి. లేనిపక్షంలో హోటల్లు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పనిచేసే వారికి కూడా వంట చేసి పెట్టే అంత గ్యాస్ నిల్వలు లేవని అన్నారు.

## జాగృతి అధ్యక్షురాలు కవితపై కేసు నమోదు

హైదరాబాద్ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై కేసు నమోదు.జాగృతి అధ్యక్షురాలు కవితపై కేసు నమోదు అయింది. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూ నిర్వాసితులతో కలిసి కవిత ధర్నా చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించినందుకు కవిత తో పాటు మరో 33 మందిపై కేసు నమోదు చేశారు. కాగా ప్రస్తుతం కవిత వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని నిరాహార దీక్షకు దిగారు.

## బన్సీలాల్ పేటలో కలెక్టర్ పర్యటన

సికింద్రాబాద్ 99రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా సనత్నగర్ నియోజకవర్గం, బన్సీలాల్ పేట్ ను కలెక్టర్ దాసరి హరి చందన మంగళవారం సందర్శించారు. జీ హెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలసి శిథిలావస్థకు చేరిన వాంబే పథకంలోని భవనాలను కలెక్టర్ పరిశీలించారు. పాత వాంబే పథకంలో నిర్మించిన నాలుగు బ్లాకుల ఇళ్లను వారు పరిశీలించి గోడలు బీటలు వారడం, స్లాబుల నుండి పెచ్చులు ఊడిపడుతుండడం గమనించారు. అంగన్ వాడి, ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం గురించి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. గాంధీ పట్టణ ఆరోగ్య కేంద్రంలోకి వెళ్ళి, అక్కడ రోజువారీ బయోవేస్ట్ ను వేరుగా చేయాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. రెండు చోట్ల ఉన్న ఖాళీ స్థలంలో పిల్లల పార్కులను అభివృద్ధి చేయాలని జోనల్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులను పంపించి సమగ్ర రిపోర్ట్ తీసుకొని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు నిపుణులు రిపోర్టుల ఆధారంగా వీటిని కూల్చి వేసి నూతన భవనాలు నిర్మించడమా లేక మరమ్మతులు సరిపోతాయనే అంశం తెలుస్తామన్నారు. కలెక్టర్ తో పాటు జీహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కే అలివేలు మంగతాయారు, కవాడిగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆర్ పుష్పలత, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, తాసిల్దార్ పాండు నాయక్ అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యత, భద్రతపై రాజీ లేదు

### మంత్రి నిమ్మల రామానాయుడు

పోలవరం పోలవరం సహా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నాం. ఇరిగేషన్ రంగానికి గతంలోనూ, ఇప్పుడు పెద్ద పీట వేసి, అవి పూర్తి అయ్యేలా చేసింది, చేస్తోంది కూటమి ప్రభుత్వమేనని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం ఆయన పోలవరం దగ్గర మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణాల నాణ్యత విషయంలో ఎక్కడా, రాజీ పడే ప్రసక్తే ఉండకూడదని చంద్రబాబు సూచించారు.
గత ప్రభుత్వంలో కీలకమైన డయాఫ్రం వాల్ ధ్వంసం అయింది . నాణ్యత,ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే, కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాం. సి డబ్ల్యూ సి డిజైన్స్ ప్రకారమే పోలవరం పనులు జరుగుతున్నాయి. అంతర్జాతీయ ప్యానల్ ఎక్స్పర్ట్స్ సూచనలు పాటిస్తూ పనులు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ప్రతిరోజు డిజైన్ల ప్రకారం జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తుంది. ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు కేంద్రానికి తెలియజేస్తున్నాం. కొత్త డయాఫ్రం వాల్ 1372 మీటర్లకు గానూ, 1300 మీటర్లు నేటికి పూర్తయి, ఈ నెలాఖరికి పూర్తవుతుంది. ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతంలో నేలను గట్టిపరచేలా వైబ్రో కాంప్యాక్షన్ పనులు పూర్తి చేశామన్నారు.
ఈఏడాది జూన్ నాటికి కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులు పూర్తి చేస్తాం. నాడు 2016లో నిర్వాసితులకు 700 కోట్ల పరిహారం అందించిన చంద్రబాబే, మరలా కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు దఫాలుగా 1900 కోట్లు పంపిణీ చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం పై సూచనలు, సలహాలు, విమర్శల డిమాండ్స్ వస్తున్న వాటిని మనస్ఫూర్తిగా స్వీకరిస్తాం. ప్రాజెక్ట్ నిర్మాణ నాణ్యత పై గాని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని అన్నారు..

## మృత్యుంజయస్వామికి ప్రత్యేక అభిషేకాలు

శ్రీకాళహస్తి దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో మృత్యుంజయ స్వామికి ప్రత్యేక అభిషేకం జరిగింది. పాలు, పెరుగు, తేనె, చంద్రవంక, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పూలమాలలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విశేష అభిషేకంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పంచభూతాలలో ఒకటైన శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారు ప్రత్యేకంగా రాహుకేతు పూజలు నిర్వహించుకుని, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, క్యూ లైన్లలో మంచినీటి సదుపాయం కల్పించారు. దర్శనం త్వరగా జరిగేలా ఏర్పాట్లు చేశారు.

## రెండు బైకులు ఢీ..
## నలుగురికి గాయాలు

అరకు అల్లూరి సీతారామరాజు డుంబ్రిగూడ మండలంలోని అరకు ప్రధాన రహదారిపై జరిగిన ద్విచక్ర వాహనాల ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ బయటకు వచ్చింది. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, లైవ్ యాక్సిడెంట్ వీడియోలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఘటన జరిగిన క్షణాలు స్పష్టంగా రికార్డ్ కావడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్వోబిలకు నిధులు మంజూరు

విజయనగరం విజయనగరం నియోజకవర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల్లో ఆర్వోబీలకు 150 కోట్లు పైబడి నిధులు మంజూరయ్యాయని, రెండు నెలల్లో పనులకు శ్రీకారం చుడతామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైల్వే మూడోలైన్ పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో అండర్ గ్రౌండ్ వంతెనలతో పాటు ఆర్వోబీ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 120 కోట్లకు పైబడి పల్లెపండగ పనులు చేపట్టామన్నారు. జలజీవన్ మిషన్ నిధులు మంజూరు కావాల్సి ఉందని, మూడు నెలల్లో పనులు పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గజపతినగరంలో జాతీయ రహదారి నుంచి మెంటాడ రైల్వేగేటు వరకు 54లక్షలతో కల్వర్టు నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు
## ప్రభాకర్ రావుకు బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ ఫోన్ ట్యాపింగ్ కేసు లో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ టి ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ బివి నాగరత్న మరియు జస్టిస్ ఆర్ మహాదేవన్ లతో కూడిన ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి సహాయం చేయడానికి రాజకీయ నాయకులు, హైకోర్టు న్యాయమూర్తులు మొదలైన వారి ఫోన్లను ట్యాప్ చేసినట్లు అయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే కేసు దర్యాప్తు దాదాపు పూర్తయిందని రాష్ట్రం సమర్పించిన వాదన, దర్యాప్తుకు సహకరించాలన్న కోర్టు ఆదేశాలన్నింటినీ తాను పాటించానని రావు సమర్పించిన వాదన దృష్ట్యా కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.
రాష్ట్రం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదిస్తూ, రావుకు అరెస్టు నుండి మధ్యంతర రక్షణ కల్పించవచ్చని, అదే సమయంలో పిటిషన్ నిర్వహణకు సంబంధించిన చట్టపరమైన ప్రశ్నను తెరిచి ఉంచవచ్చని వాదించారు. గతంలో ప్రభాకర్ రావుకు ఇచ్చిన మధ్యంతర బెయిల్ ను.. రెగ్యులర్ బెయిల్ గా కోర్టు మార్చింది.

## గన్ పార్క్ వద్ద మిలియన్ మార్చ్

హైదరాబాద్ మంగళవారం నాడు గన్ పార్క్ దగ్గర మిలియన్ మార్చ్ ను పలువురు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు ఆచార్య కోదండరామ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, తెలంగాణ ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ?? అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. ఆచార్య కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మర్చిపోలేని రోజు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ను ప్రపంచానికి చాటి చెప్పేందుకు... లక్షలాది తెలంగాణ ప్రజలు ట్యాంక్ బండ్పైకి చేరి... ఆత్మగౌరవ గర్జన చేసిన చారిత్రాత్మక రోజు 10 మార్చి 2011. ఆ రోజున జరిగిన మిలియన్ మార్చ్ తెలంగాణ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన కీలక ఘట్టమని అన్నారు.

### బద్వేల్ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ గా
## బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్



బద్వేలు బద్వేల్ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ గా బద్వేల్ ఆర్డిఓ చంద్రమోహన్ ను ప్రభుత్వం నియమించింది మంగళవారం స్పెషల్ ఆఫీసర్ ను బద్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సిబ్బంది చంద్రమోహన్ ను కలిసి అభినందనలు తెలిపారు

## కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న
## జిల్లా విద్యాశాఖ అధికారి

**- పాఠశాలలో బియ్యం అక్రమ రవాణాపై ప్రధానోపాధ్యాయుడిపై విచారణలో జాప్యం ఎందుకు? - ఏఐఎస్ఎఫ్ డిమాండ్**

కౌతాళం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా, జిల్లా విద్యాశాఖ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షబ్బీర్ భాషా జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల బియ్యాన్ని అక్రమంగా వాహనాల్లో తరలించి విక్రయిస్తున్నారని గ్రీవెన్స్ లో కలెక్టర్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై స్పందించి ఫిబ్రవరి 23వ తేదీన (సోమవారం) సదరు ప్రధానోపాధ్యాయుడిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి (ఆఖా) ఆదేశించారని గుర్తు చేశారు.కానీ, కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఉండి దాదాపు రెండు వారాలు పైగా గడుస్తున్నా, జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి ఎటువంటి కదలిక లేకపోవడం శోచనీయమన్నారు. అధికారుల ఈ ఉదాసీనత అవినీతికి పాల్పడిన వారికి వత్తాసు పలుకుతున్నారని ఆయన విమర్శించారు. పాఠశాల వనరులను దుర్వినియోగం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రధానోపాధ్యాయుడిని వెంటనే విచారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.అలాగే కలెక్టర్ ఆదేశాలను అమలు చేయడంలో వైఫల్యం చెందిన అధికారులపై చర్యలు తీసుకోవాలి అన్నారు నిష్పక్షపాతంగా విచారణ జరిపేందుకు ఉన్నత స్థాయి అధికారులను నియమించాలి. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆర్జెడి వెంటనే జోక్యం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా నగర అధ్యక్ష కార్యదర్శి అశోక్,అభి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్
## కార్యాలయల్లో ఏసీబీ దాడులు

అమరావతి : ఏపీ వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు జరిపారు. విశాఖ, గుంటూరు, కడప, అనంతపురం, తిరుపతి మున్సిపల్ ఆఫీసుల్లో ఏసీబీ సోదాలు జరిగాయి. ఏకకాలంలో గాజువాక, పెందుర్తి జోనల్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు జరిగాయి. అనంతపురం, శ్రీకాకుళం, ఏలూరు, తిరుపతి, నెల్లూరు టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారుల సోదాలు కొనసాగాయి. ఏసీబీ అధికారులు పలు ఆరోపణలతో రికార్డులు పరిశీలిస్తున్నారు. ఒక్కో అప్లికేషన్ కు ఒక్కో రేటు పెట్టినట్లు గుర్తించారు. అర్జి దారులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయనికి ఫిర్యాదులు చేసారు. ఈ ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టారు.

## అపోలో యూనివర్సిటీలో
## అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి వర్క్‌షాప్




చిత్తూరు:మురకంబట్టులోని ది అపోలో యూనివర్సిటీలో అకాడమిక్ అఫైర్స్ డైరెక్టరేట్, మానవ వనరుల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్‌ప్రొఫెషనల్ అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్ (ఎజఖ)లో భాగంగా "ఎంగేజ్, ఇంటరాక్ట్, టీచ్: లార్జ్ అండ్ స్మాల్ గ్రూప్ టీచింగ్ స్ట్రాటజీస్" అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. అధ్యాపకులు పెద్ద, చిన్న విద్యార్థి సమూహాల్లో సమర్థవంతంగా బోధన చేయడానికి అవసరమైన ఆధునిక బోధన పద్ధతులపై అవగాహన కల్పించారు.క్యాంపస్‌లోని డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ది అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక విశ్వవిద్యాలయం నాణ్యత ప్రధానంగా అక్కడి అధ్యాపకుల నైపుణ్యం, బోధన పద్ధతులపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. సమర్థవంతమైన టీచింగ్?లర్నింగ్ విధానాలు అమలు చేసినప్పుడే విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక దృక్పథం పెరుగుతాయని అన్నారు. ఎఐఎంఎస్ఆర్‌లో అమలవుతున్న ఆధునిక మెడికల్ ఎడ్యుకేషన్ మోడల్స్ మంచి ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొంటూ, అలాంటి వినూత్న బోధన పద్ధతులను ఇతర విభాగాల్లో కూడా అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ వర్క్‌షాప్‌లో ఎఐఎంఎస్ఆర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ సచ్చిదానంద అడిగ, ఎఐఎంఎస్ఆర్ పాథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి బ్రహ్మయ్య రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొన్నారు. వారు తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచే విధానాలు, చిన్న మరియు పెద్ద సమూహాల్లో బోధనను సమర్థవంతంగా నిర్వహించే పద్ధతులపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్బ్లైడ్ జె. అగస్టిన్, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డి. జగదీషన్, ఎసిఎఫ్ అసిస్టెంట్ డీన్ డాక్టర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ విభాగాల అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరై వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చే సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ



తిరుపతి సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం మధ్యాహ్నం అందించారు. ఆరుగురు లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. చెన్నారెడ్డికాలనికి చెందిన వెంకటరమణ రెండు లక్షల తొమ్మిది వందల యాభై రూపాయల చెక్కు ను అందుకున్నారు. జీవకోనకు చెందిన మొతుకూరి తేజ రెండు లక్షలా ఎనభై నాలుగు వేలు, లక్ష్మీ దేవి డెబ్భై నాలుగు వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నుంచి అందుకున్నారు. కొత్తపల్లికి చెందిన చంద్రారెడ్డి కి లక్షా అరవై ఆరు వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందించారు. రేణిగుంట రోడ్డు కు చెందిన పరంధామయ్య కు రెండు లక్షల మూడు వేల రూపాయలు, గురుప్రసాద్ మూడు లక్షల ముప్పై రెండు వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. పేదలకు ఆర్థిక భరోసాను కల్పించేందుకు సీఎంఆర్ ఎఫ్ ను ప్రభుత్వం అందిస్తున్నదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, రాజేష్ ఆచ్చారి, బాబ్జీ, సాయిదేవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయండి.

### స్మార్ట్ సిటీ చైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్.




నగరంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ లో పెండింగ్ లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ చైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ 42 బోర్డు సమావేశం స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్, తుడా వి. సి. గోవింద రావు, ఇండిపెండెంట్ డైరెక్టర్లు డాక్టర్ రమాశ్రీ లు ఆన్లైన్ ద్వారా పాల్గొనగా నగరపాలక సంస్థ కార్యాలయం నుండి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొని పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. తూకివాకం వద్ద స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ లో భాగంగా ఏర్పాటు చేస్తున్న 6మెగా వాట్ గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్రాజెక్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇంటిగ్రెటెడ్ కమాండర్ కంట్రోల్ సెంటర్ లో బాగంగా నగరంలో సిసి కెమెరాల ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ లో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు లను త్వరగా పూర్తి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో బోర్డు డైరెక్టర్ డాక్టర్ రామచంద్రా రెడ్డి, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఈ.ఈ.రవి, తదితరులు పాల్గొన్నారు.

## హైవే రహదారి గ్రామం లోనే
## వెళ్తేనే గ్రామ అభివృద్ధి సాధ్యం

### టిడిపి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్



నందవరం మండలం పరిధిలో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు దేశాయ్ మాధవ్ స్వామి,బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్,రైస్ మిల్లు నారాయణ రెడ్డి లు పత్రిక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాధవరావు దేశాయ్ మాట్లాడుతూ ముగతి నుండి నాగలదిన్నె వరకు బైపాస్ రోడ్డు నందవరం ఊరి లోపల నుంచి పోవాలని కోరారు.రోడ్డు కోసం పోయిన ఇండ్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అలాగే నందవరం అభివృద్ధి అవుతుందంటే మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి తనియుడుతోనే సాధ్యమన్నారు గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి శూన్యం అంటూ అలాగే విలేజ్ పార్క్ ఎటువంటి అభివృద్ధి లేదన్నారు.

శనివారం వచ్చిందంటే రోడ్డుపై సంత మార్కెట్ రోడ్డు మీద కాయగూరలు పెట్టి చాలా ఇబ్బందులు పడుతున్నారు ప్రజలు నందవరం విలేజ్ మార్కెట్ పట్టించుకున్న నాథుడు లేరని గత ప్రభుత్వంలో ఇప్పుడు మన కూటమి ప్రభుత్వం దాని గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్దాం నారా లోకేష్ మంత్రిగా ఉన్నప్పుడు విలేజ్ పార్క్,విలేజ్ మార్కెట్ ప్రారంభవించాడు.గత ఐదు సంవత్సరాలలో వైఎస్ఆర్ పార్టీ అభివృద్ధి చేయలేకపోయింది ఎమ్మెల్యే దృష్టికి పోయిన వెంటనే త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారని అన్నారు.ఈ కార్యక్రమంలో గజేంద్ర రెడ్డి బ్రహ్మానంద రెడ్డి వెంకటేష్ శ్రీనివాసులు నరసింహులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో పంట ఉత్పాదకత, రైతు సంక్షేమంపై వివరాలు కోరిన ఎంపీ గురుమూర్తి



వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో పంటల ఉత్పాదకత పెంపు అంశంపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి లోక్‌సభలో ప్రశ్నించారు. వరి వంటి ప్రధాన పంటల దిగుబడులు జాతీయ సగటుతో పోలిస్తే తక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక పంట ఉత్పాదకత వ్యూహం రూపొందించిందా అని కేంద్రాన్ని అడిగారు. అలాగే జిల్లాల వారీగా దిగుబడి లోటుపాట్లపై అంచనాలు చేసి వాటిని రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకున్నారా, సూక్ష్మ సాగు విధానాలు, మెరుగైన విత్తనాల వినియోగం, వ్యవసాయ సలహా సేవలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల అనుసంధానం వంటి చర్యలు తీసుకుంటున్నారా అని వివరాలు కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ మిషన్ ద్వారా వరి, గోధుమలు, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనె గింజలు వంటి పంటల ఉత్పత్తి పెంపు లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ప్రతి సీజన్‌కు ముందు విత్తన అవసరాలు అంచనా వేస్తూ కొత్త అధిక దిగుబడి రకాలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి పథకం ద్వారా నీటి వినియోగాన్ని సమర్థవంతంగా ఉపయోగించేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. 2015,16 నుండి 2026 ఫిబ్రవరి వరకు ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 11.49 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలు చేసినట్లు వెల్లడించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడానికి రాష్ట్రంలో 716 ఎఫ్‌పీవోలు నమోదు కాగా, 318 ఎఫ్‌పీవోలకు సుమారు రూ.20.84 కోట్ల ఈక్విటీ గ్రాంట్ విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది. రైతులు అధిక విలువ కలిగిన పంటల వైపు మళ్లేందుకు ఉద్యాన పంటల అభివృద్ధి, పంట వైవిధ్యీకరణ, వాల్యూ చైన్ అభివృద్ధి వంటి కార్యక్రమాలు కూడా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే పప్పుధాన్యాల ఉత్పత్తి పెంపు కోసం "మిషన్ ఆత్మనిర్భర్ ఇన్ పల్సెస్", నూనె గింజల ఉత్పత్తి పెంపు కోసం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ వంటి పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు.

## శ్రీ సత్యసాయి జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

కదిరి శ్రీ సత్యసాయి జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా టీడీపీ, బీజేపీల మధ్య విభేదాలు తలెత్తాయి. బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంతో కదిరి ఎమ్మెల్యే కందికుంటపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తన అహం తీర్చుకోవడానికి పోలీసులపై ఒత్తిడి తేవడం సరికాదని, దేవుని వద్ద రాజకీయాలు వద్దని, ఎమ్మెల్యే కోరిక తీరాలంటే ఒక్కరే తేరును జరుపుకోవాలని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ప్రఖ్యాతిగాంచిన కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కదిరి తేరు ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రాజకీయ కారణాలతోనే తనపై ఆంక్షలు విధించారని విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. తేరులో పాల్గొనకుండా ఆయనను పోలీసులు అడ్డుకున్నారు.

## రథోత్సవంతో అపశృతి ఒకరికి తీవ్ర గాయాలు

శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మ రథోత్సవంలో విషాదం చోటుచేసుకుంది. అత్యంత వైభవంగా జరుగుతున్న ఈ వేడుకలో రథాన్ని లాగుతున్న సమయంలో ఒక్కసారిగా అపశృతి. వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య రథం కదులుతుండగా, ఓ భక్తుడు ప్రమాదవశాత్తూ రథం చక్రం కింద పడిపోయాడు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది. సదరు భక్తుడికి తీవ్ర గాయాలవ్వడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## వెలుగుమట్ల భూ బాధితుల గుర్తింపు.. టోకన్ల జారీ

ఖమ్మం ఖమ్మం వెలుగుమట్ల భూధాన్ భూముల కూల్చివేతలో కీలక పరిణామం ఏర్పడింది. 311 మందిని బాధితులుగా ప్రభుత్వం గుర్తించింది. ఖమ్మం కలెక్టరేట్లో టోకెన్ల జారీ ప్రారంభించింది. రెవిన్యూ అధికారులు బాధితులందరినీ పిలిచి టోకెన్లు పంపిణీ చేస్తున్నారు. బుధవారం ముగ్గురు మంత్రుల చేతుల మీదుగా పట్టాల పంపిణీ చేసేందుకు అధికారుల సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

## ఈవీఎం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా




కరీంనగర్ జిల్లా కేంద్రనీ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాం మంగళవారం జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా మాట్లాడుతూ. ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదానీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ ఫుటేజ్ ల గదుల పనితీరు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ లక్ష్మి కిరణ్ ఆర్డీవో కె. మహేశ్వర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేనీ శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి దేవిశెట్టి నవీన్ కుమార్, టిడిపి పార్టీ ప్రతినిధి ఎర్రవెల్ళి రవీందర్ బీఎస్పీ పార్టీ ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## మిలియన్ మార్చ్ ను గుర్తు చేసుకొన్న కేటీఆర్

హైదరాబాద్ ట్యాంక్బండ్పై లక్షల గొంతుకలు గర్జించాయని పోస్టులో పేర్కొన్న కేటీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టమైన 'మిలియన్ మార్చ్'కు నేటితో 15 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసేలా చేసిన అద్భుత పోరాట రూపాల్లో ఇదొకటని ఆయన పేర్కొన్నారు. ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 2011 మార్చి 10న జరిగిన మిలియన్ మార్చ్ను స్మరించుకున్నారు. "స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్బండ్పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లునిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్లు, ఇనుపకంచెలు ఏవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయి" అని కేటీఆర్ తన పోస్టులో రాసుకొచ్చారు. స్వరాష్ట్రం కోసం లక్షల గొంతుకలు ట్యాంక్బండ్పై ఏకమై నినదించిన అద్భుత పోరాటానికి నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ తన పోస్టుకు ఆనాటి మిలియన్ మార్చ్కు సంబంధించిన కొన్ని ఫొటోలను జతచేశారు. "తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ" అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు.

## కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో ప్రవేశలకు దరఖాస్తులు ఆహ్వానం.

### ఈ నెల 12 వ తేదీ నుండి ప్రారంభం.ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.

### అడిషినల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్,డా. వి. ఎ.స్వామి నాయుడు వెల్లడి.

అల్లూరి సీతారామరాజు జిల్లా, సమగ్ర శిక్ష అధ్వర్యంలో నిర్వహిస్తున్న 19 కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాలలో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ నెల 12వ తేది నుండి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం జారుతుంది. వార్షికాదాయము గ్రామీణ ప్రాంతాలవారికి రూ.1.20 లక్షల్లోపు, పట్టణ ప్రాంతం వారికైతే రూ.1.44 లక్షల్లోపు ఉండాలని నిర్ణయించింది. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో ఎటువంటి ప్రవేశ పరీక్షా లేకుండా, కేవలం రిజర్వేషన్ మరియు సర్టిఫికెట్ ఆధారంగా ఎంపిక చేయటం జరుగుతుంది. ప్రవేశాల్లో ప్రాధాన్యతలు :6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రతీ తరగతిలో 40 పరిమిత సీట్లు మాత్రమే కేజిబివిలలో ఉంటాయి. ఈ సీట్లలో బడి బయట ఉన్న బాలికలకు మొదటి ప్రాధాన్యం, తల్లిదండ్రులు ఇద్దరూ లేని అనాథ బాలికలకు రెండో ప్రాధాన్యం, తల్లి లేదా తండ్రి (సింగల్ పేరెంట్) ఒకరు మాత్రమే ఉన్న వారికి మూడో ప్రాధాన్యం, విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నాల్గవ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు కూడా 40 సీట్లు మాత్రమే ఉంటాయి. వీటికి కూడా ఒకే నిబంధనలు వర్తిస్తాయి.. వీటితోపాటు కేజిబివిలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థినులకు తొలి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. రిజర్వేషన్లు :ఓసి(ఓపెన్ కేటగిరి) 50 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీ-ఏ 7 శాతం, బీసీ-బి 10 శాతం, బీసీ-సి 1 శాతం, బీసీ-డి 7 శాతం, బీసీ-ఈ 4 శాతం, అనాథలకు, అంగవైకల్యం కలిగినవారికి 10 శాతం చొప్పున 40 సీట్లను భర్తీ చేస్తారు

## మదనపల్లెలో పి ఎం విశ్వకర్మ గ్రాండ్ ఎగ్జిబిషన్

రాయచోటి: పీఎం విశ్వకర్మ గ్రాండ్ ఎగ్జిబిషన్ అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో మూడు రోజులపాటు గ్రాండ్ గా నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ డి వి ఎస్ ఆర్ మూర్తి తెలిపారు మంగళవారం పీఎం విశ్వకర్మ ఎగ్జిబిషన్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు విశ్వకర్మ ఎగ్జిబిషన్ నిర్వహణపై విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. అసిస్టెంట్ డైరెక్టర్, ఏం ఎస్ ఎం ఇ - డీఎఫ్ఓ, విశాఖపట్నం. ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో, జిల్లా పరిశ్రమల కేంద్ర అన్నమయ్య జిల్లా సహకారంతో నిర్వహిస్తున్న పి ఎం ట్రేడ్ ఫెయిర్ ? కమ్ ? ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని .వి.ఎస్.ఆర్ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్, ఏం ఎస్ ఎం ఇ - డీఎఫ్ఓ, తెలిపారు. ఈ ప్రదర్శన మార్చి 13 నుండి 15 వరకు మదనపల్లి లోని పద్మావతి కళ్యాణమండపం, శివాజీ నగర్, సీటీఎం రోడ్ వద్ద ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వర విశ్వకర్మ ఎగ్జిబిషన్ కమ్ ట్రేడ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో 50కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేసి, విశ్వకర్మ పథకానికి చెందిన వివిధ సంప్రదాయ వృత్తుల కళాకారుల ఉత్పత్తులు మరియు పనితీరును ప్రదర్శించనున్నారు. ముఖ్యంగా వడ్రంగి, స్వర్ణకారుడు, శిల్పి, ధోబీ, బొమ్మల తయారీదారులు, కుమ్మరి, కమ్మరి, పనిముట్ల తయారీదారులు, తాళాల తయారీదారులు, మేస్త్రీలు, చెప్పుల తయారీదారులు, గంపలు/చాపలు/చీపుర్లు తయారీదారులు (మేదరి), కొబ్బరి పీచు నేతకారులు, క్షురకులు, పూలదండల తయారీదారులు, పడవ తయారీదారులు, చేపల వలల తయారీదారులు వంటి పలు వృత్తులకు చెందిన కళాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా విశ్వకర్మ హస్తకళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే కాకుండా, తయారీదారులు, వ్యాపారులు మరియు వినియోగదారులు పరస్పరం ప్రత్యక్షంగా కలుసుకునే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. హస్తకళల ఉత్పత్తులను కొనుగోలు చేయడం, అమ్మకం చేయడం, మార్కెట్ చేయడం వంటి అవకాశాలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి సాధారణ ప్రజలు, సందర్శకులు, ఎం ఎస్ ఎం ఈ ప్రతినిధులు, చేతివృత్తులవారు అందరూ ఉచితంగా ప్రవేశించి సందర్శించవచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీ డి.వి.ఎస్.ఆర్ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ ను సెల్ నెంబర్. 9492689462 సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని విధంగా పత్రిక ద్వారా విస్తృత ప్రచారం మరియు కవరేజ్ అందించి విజయవంతం చేయాలని కోరారు.

## గుంటూరు నగరపాలక సంస్థలో ఏసీబీ దాడులు

గుంటూరు నగరపాలక సంస్థలో అవినీతి ఫిర్యాదులపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. డీజీపీ ఆదేశాల మేరకు నేడు, రేపు కూడా సోదాలు కొనసాగుతాయని, టౌన్ ప్లానింగ్ విభాగంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు. విధుల్లో ఉన్న సిబ్బందిని విచారిస్తున్నారు. అవినీతికి పాల్పడిన వారిని విడిచిపెట్టేది లేదని ఏసీబీ బృందం స్పష్టం చేసింది. ఈ దాడులు నగరపాలకసంస్థలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

## సావిత్రి బాయి పూలే ఆశయాలు సాధన అందరి బాధ్యత

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి సావిత్రి బాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా మహిళ యూనివర్సిటీ సమీపంలోని సావిత్రి బాయి పూలే విగ్రహానికి మంగళవారం ఉదయం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి వేడుకలు జరిగాయి. విద్యతో సమాజ మార్పు సాధ్యమని నమ్మి మహిళా విద్య కోసం జీవితాంతం పోరాడిన గొప్ప యోధురాలు సావిత్రి బాయి పూలే అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బీసీ, ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతికి సావిత్రి బాయి పూలే ఎంతో కృషి చేశారని ఆయన చెప్పారు. మహిళా విద్య, సామాజిక న్యాయం కోసం ఎన్నో అవమానాలు పొందినా ఆశయ లక్ష్య సాధనలో వెనకడుగు వేయని గొప్ప నాయకురాలు సావిత్రి బాయి పూలే అని ఆయన తెలిపారు. సావిత్రి బాయి పూలే ఆదాయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, అశోక్ సామ్రాట్ యాదవ్, అక్కినపల్లి లక్ష్మయ్య, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, కందాటి సురేష్ రెడ్డి, బుజ్జిబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కౌబాయ్ లుక్ లో ఉస్తాద్ పవన్ కళ్యాణ్

పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కాంబోలో రూపొందిన సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్. ఈనెల 19న విడుదల అవుతోంది..45 సెకన్ల డ్యూరేషన్ ఉన్న టీజర్ ట్రైలర్కి ముందు ప్రోమోలా అనిపించింది. కళ్యాణ్ ని కౌబోయ్ లుక్ లో చూడడం అభిమానులకు నచ్చుతుంది. భగవద్గీత లోని శ్లోకంతో టీజర్ మొదలైంది. 'ఇందాక విన్నది భగవద్గీత.. ఇది భరత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు' అంటూ పవర్ ఫుల్ డైలాగ్ వదిలారు పవన్ కళ్యాణ్. ఈనెల 16న ప్రీ రిలీజ్ ఫంక్షన్ కి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అదే రోజున ట్రైలర్ కూడా విడుదల చేసే అవకాశం ఉంది.

ఈ సినిమాలోంచి మరో రెండు పాటలు బయటకు రావాలి. వాటిని 16 లోగా ఒకొక్కటిగా విడుదల చేస్తారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి పాటలు అందించారు. కమర్షియల్ ప్యాకేజ్గా ఈ సినిమాని మలిచారు హరీష్. పవన్ అభిమానులకు కావాల్సిన మసాలా అంతా ఈ సినిమాలో పొందు పరిచారు. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలుగా నటించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీస్ సంస్థ నిర్మించింది.

## త్వరలో దురంధర్ ..ది రివెంజ్

బాలీవుడ్కు కొత్త జోష్ ఇచ్చింది 'ధురంధర్'. ఆ సినిమా సాధించిన వసూళ్లు హిందీ సినిమా స్టామినాను మరోసారి నిరూపించాయి. ఇప్పుడు ఆ సినిమాకి సీక్వెల్గా 'ధురంధర్: ది రివెంజ్' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా విడుదలైన ట్రైలర్ ధురంధర్ ఫ్యాన్స్ అంచనాలకు తగ్గట్టుగానే కట్ చేశారు. రెహ్మాన్ దకైత్ తర్వాత లెయిరీ పాలకుడు ఎవరు అన్నదే సెకండ్ పార్ట్. ఆ సంఘర్షణ చుట్టూనే ట్రైలర్ సాగింది. రణవీర్ సింగ్ జస్కిరత్ సింగ్ రంగీ, హమ్జా అనే రెండు పాత్రల్లో కనిపించిన తీరు మరో స్థాయిలో ఉంది.

ఆర్. మాధవన్, ఐఎస్ఐ మేజర్ ఇక్బాల్ పాత్రలో అర్జున్ రాంపాల్, ఎస్పీ చౌధరి అస్లం పాత్రలో సంజయ్ దత్.. ఈ పాత్రలన్నీ పవర్ఫుల్గా కనిపిస్తున్నాయి. పార్ట్ 2లో యాక్షన్కు మరింత ప్రాధాన్యత ఇచ్చారు. రివెంజ్ కోణంలో నడిచే సన్నివేశాలు కథలోని తీవ్రతను ప్రతిబింబిస్తున్నాయి. దర్శకుడు ఆదిత్య ధర్ మరోసారి ఎక్కడా రాజీపడని కంటెంట్తో ముందుకు వస్తున్నాడని ట్రైలర్లోని డైలాగ్స్ వింటే అర్థమవుతోంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుకు బిగ్ రిలీఫ్!

హైదరాబాద్ తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో కీలక నిందితుడిగా ఉన్న ప్రభాకర్రావుకు సుప్రీంకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్పై విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం, ప్రభాకర్ రావుకు బెయిల్ మంజూరు చేయాలని ధర్మాసనం నిర్ణయించింది.

అయితే, విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని కోర్టు స్పష్టమైన షరతులను విధించింది. ఈ కేసు విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు కీలక సమాచారం అందించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరిన్ని సాక్ష్యాలను సేకరిస్తున్నామని, కొద్ది వారాల్లోనే ఈ కేసులో అదనపు ఛార్జ్ షీట్ దాఖలు చేస్తామని ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలపై లోతైన విచారణ కొనసాగుతోందని ధర్మాసనానికి వివరించారు.
**కేసు నేపథ్యం** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు రావడంతో ఈ కేసు తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారిగా ప్రభాకర్ రావు ఉన్నారని పోలీసులు కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించి ఇప్పటికే పలువురు పోలీసు ఉన్నతాధికారులు అరెస్టై జైల్లో ఉండగా, విదేశాల్లో ఉన్న ప్రభాకర్ రావుకు తాజాగా లభించిన ఈ బెయిల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## సర్కార్ సంచలన నిర్ణయం..

### రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల పునర్విభజన..

అమరావతి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలు తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సంస్కరణలు తీసుకువస్తోంది. ఇందులో భాగంగా జనాభా, ఆదాయం, భౌగోళిక ప్రాంతం ఆధారంగా పంచాయతీల పునర్విభజన చేయాలని నిర్ణయించింది. ఇదివరకు నియమించిన కమిటీ సిఫార్సుల ఆధారంగా పలు గ్రామ పంచాయతీలకు కేటగిరీలు విభజించింది. గ్రామ పంచాయతీలను పునర్వ్యవస్థీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా, అనంతపురం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, బాపట్ల, చిత్తూరు జిల్లాల్లోని పలు పంచాయతీలను గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 కేటగిరీలుగా వర్గీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లోనూ పట్టణాల తరహా సదుపాయాల కల్పనకు కొత్తగా రూర్బన్ పంచాయతీల ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 10 వేల జానాభా ఉంటే రూర్బన్ పంచాయతీలుగా విభజించింది. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయా జిల్లాల్లో వర్గీకరించిన గ్రామ పంచాయతీల నిధులు సజావుగా వినియోగించేందుకు సీఎ ఫఎంఎస్ పోర్టల్లో వివరాలు ఉంచాలని కోరింది. ఆన్లైన్ డేటాలో అవసరమైన మార్పులు చేయాలని ఏపీ ట్రెజరీ డైరెక్టర్ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## కదిరిలో రాజకీయ విభేదాలు

అనంతపురం శ్రీసత్యసాయి జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కదిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో రాజకీయ విభేదాలు భక్తులను విస్మయానికి గురిచేస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. స్వామివారి అత్యంత పవిత్రమైన బ్రహ్మరథోత్సవంలో పాల్గొనేందుకు సిద్ధమైన ఒక ప్రముఖ నేతను, అదీ అధికార పక్షంలో భాగస్వామిగా ఉన్న వ్యక్తిని గృహనిర్బంధం చేయడం వెనుక స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్నేళ్లుగా కదిరి రథోత్సవం సందర్భంగా రథంపై నిలబడి భక్తులకు సూచనలు ఇస్తూ, స్వామివారి సేవలో తరిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డిని ఈసారి ఉద్దేశపూర్వకంగానే అడ్డుకున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా తన ఆధిపత్యానికి ఎక్కడ గండి పడుతుందోనన్న భయంతోనే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ హౌస్ అరెస్ట్ చేయించారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఒక హిందూ ధర్మ పరిరక్షకుడిగా, భక్తుడిగా స్వామివారి రథోత్సవానికి వెళ్లే హక్కును కాలరాయడంపై హిందూ సంఘాలు , బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రథోత్సవం వద్దకు విష్ణువర్ధన్ రెడ్డి వస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు చెబుతున్న కారణం హాస్యాస్పదంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. సొంత కూటమి నేతపైనే ఇటువంటి ఆంక్షలు విధించడం ద్వారా ఎమ్మెల్యే ఏం సందేశం ఇవ్వదలుచుకున్నారని బీజేపీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. దేవుడి దర్శనానికి వెళ్లే ఒక భక్తుడిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమే కాకుండా, ఆధ్యాత్మిక స్వేచ్ఛను హరించడమేనని మేధావులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రస్థాయిలో టీడీపీ-బీజేపీ-జనసేన అగ్రనేతలు ఎంతో సమన్వయంతో సాగుతుంటే, కదిరిలో మాత్రం ఎమ్మెల్యే తీరు కూటమి స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉంది.

విష్ణువర్ధన్ రెడ్డి వంటి సీనియర్ నేతను అవమానించడం ద్వారా క్షేత్రస్థాయిలో కేడర్ మధ్య దూరం పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రాజకీయ వైరాలు ఉండవచ్చు కానీ, దేవుడి సన్నిధిలో కూడా ఇలాంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడటం ఎమ్మెల్యే స్థాయికి తగదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తమను అడ్డుకోవడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీశారని, ఇది కేవలం తనపై జరిగిన దాడి కాదని, తన భక్తిపై జరిగిన దాడి అని విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వ్యవహారశైలిని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ ఘటనతో కదిరిలో కూటమి పార్టీల మధ్య సంబంధాలు ఏ మలుపు తిరుగుతాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

## ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు

హైదరాబాద్ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్కు తరలించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పేదల కోసం గళమెత్తిన తనను ఒక ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. హైదరాబాద్లోని జాగృతి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కర్కశంగా కూల్చివేసిన తీరును తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటేనే పేదలకు ఇచ్చేవి అని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ, ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును గమనించాలని కవిత సూచించారు. ఈ అన్యాయంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఉన్నారని, పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ఆమె నిలదీశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ వేసి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## మార్చి 27న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు

# రానున్న ప్రియదర్శి 'సుయోధన'




తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనతో అలరిస్తున్న యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సుయోధన'. ఈ సినిమాకు సంబంధించి తాజాగా మేకర్స్ ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ ప్రస్తుతం సినీ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది.ప్రజ్వల లైన్ క్రియేషన్స్ బ్యానర్‌పై బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి, వై.ఎస్. మాధవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రియదర్శి సరసన ద్రిషిక చందర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా 'డైలాగ్ కింగ్' సాయికుమార్ మరియు సీనియర్ నటి ప్రేమ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.ఈ సందర్భంగా నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ, "ఒక మంచి కథ, కథనాలతో అత్యుత్తమ నిర్మాణ విలువలతో 'సుయోధన' చిత్రాన్ని రూపొందించాము. ప్రియదర్శి, సాయికుమార్ గారి నటన సినిమాకు ప్రాణం పోశాయి. సంగీత దర్శకుడు జై క్రిష్ అందించిన స్వరాలు, రామజోగయ్య శాస్త్రి గారి సాహిత్యం ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యాము. త్వరలోనే టీజర్, ట్రైలర్ మరియు పాటలను విడుదల చేస్తాము" అని తెలిపారు.

## సెన్సార్ పూర్తి చేసుకున్న

# 'ఉస్తాద్ భగత్ సింగ్'.. రన్ టైమ్ లాక్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ నేడు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'యు/ఏ' సర్టిఫికేట్ జారీ చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. గతంలో పవన్ నటించిన 'హ+' చిత్రానికి గ్యాంగ్‌స్టర్ డ్రామా కారణంగా 'ఏ' సర్టిఫికేట్ రాగా, ఈసారి 'ఉస్తాద్' కు 'యు/ఏ' రావడంతో కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి చూసే అవకాశం లభించబోతుంది. మరోవైపు ఈ సినిమా మొత్తం 2 గంటల 29 నిమిషాల రన్ టైమ్‌తో రాబోతుందని సమాచారం. ప్రస్తుత కాలంలో వస్తున్న భారీ సినిమాలతో పోలిస్తే, ఈ కాంపాక్ట్ నిడివి సినిమాకు ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎక్కడా బోర్ కొట్టకుండా పక్కా కమర్షియల్ ప్యాకేజీతో హరీష్ శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది.

పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశీ ఖన్నా ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలకు ఇప్పటికే భారీ రెస్పాన్స్ వస్తుండగా, తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో లెవల్‌కు తీసుకువెళ్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

## కాంతారావుని చూస్తే MGRకి ప్యాంట్ తడిసేది..

# మళ్ళీ నోరు జారిన రాజేంద్ర ప్రసాద్



నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మరోసారి తన నోటి దురుసుతో తీవ్ర వివాదంలో చిక్కుకున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'కళాప్రపూర్ణ కాంతారావు జాతీయ అవార్డు–2025' ప్రధానోత్సవ వేదికపై ఆయన చేసిన ప్రసంగం ఇప్పుడు సోషల్ మీడియాలో వివాదంగా మారింది. దివంగత నటుడు కాంతారావు గొప్పదనాన్ని వివరించే క్రమంలో, తమిళ ప్రజల ఆరాధ్య దైవం, మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ (M.G. Ramachandran) పట్ల ఆయన వాడిన పదజాలం తీవ్ర అభ్యంతరకరంగా ఉందనే విమర్శలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. కాంతారావు గారి జానపద చిత్రాలను చూసి ఎంజీఆర్ భయపడి 'ఉచ్చ పోసుకునేవాడు' అంటూ రాజేంద్ర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువుగా మారాయి. ఆ కాలంలో కాంతారావు నటనను చూసి ఎంజీఆర్ వణికిపోయేవాడని, ఎవడ్రా వీడు ఇండియన్ సినిమాలను ఎక్కడికో తీసుకెళ్లిపోతున్నాడు అని భయపడేవాడంటూ రాజేంద్ర ప్రసాద్ అగౌరవంగా మాట్లాడటంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ముఖ్యంగా తమిళనాడులో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఒక లెజెండరీ నటుడిని గౌరవించే క్రమంలో, మరొక దిగ్గజ నటుడిని, కోట్ల మంది ఆరాధించే నాయకుడిని తక్కువ చేసి మాట్లాడటం రాజేంద్ర ప్రసాద్ సంస్కారానికి తగదని విమర్శకులు మండిపడుతున్నారు. గతంలో కూడా బ్రహ్మానందం, అలీ వంటి సహ నటులపై రాజేంద్ర ప్రసాద్ ఇలాగే వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచారు. పద్మశ్రీ వంటి ప్రతిష్టాత్మక పురస్కారం పొందిన ఒక సీనియర్ నటుడు, బహిరంగ వేదికలపై ఇలాంటి పదజాలాన్ని వాడటం పట్ల అటు సినీ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజల్లోనూ చర్చ జరుగుతోంది.

## ఊరించి ఉసూరుమనిపించారా..

# రజనీకాంత్-కమల్ హాసన్ మల్టీస్టారర్ ఇప్పట్లో లేనట్టే.!



సినిమా ఇండస్ట్రీలో ఇద్దరు హీరోలు కలిసి నటిస్తేనే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడతాయి. ఒక స్టార్ హీరోతో పాటు మరో మీడియం రేంజ్ హీరో నటించినా కూడా ఆ సినిమాకు మంచి బజ్ వస్తుంది. అలాంటిది దశాబ్దాలుగా ఇండస్ట్రీని ఏలుతున్న ఇద్దరు లెజెండరీ స్టార్స్ ఒకే సినిమాలో ఫుల్ లెంగ్త్ రోల్స్‌లో కనిపించబోతున్నారు అంటే అంచనాలు ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం సినీ ప్రేక్షకుల దృష్టంతా సూపర్ స్టార్ రజనీకాంత్, యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించబోతున్న భారీ మల్టీస్టారర్ సినిమాపైనే ఉంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను మొదటగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోగా, ప్రస్తుతం దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు సమాచారం.ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియో విడుదల కావడంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ తమదైన స్టైల్, స్వాగ్‌తో తెరపై కనిపిస్తే సినిమా మరో లెవెల్‌లో ఉంటుందనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది. అందుకే ఈ ప్రాజెక్ట్ గురించి చిన్న వార్త వచ్చినా కూడా అది పెద్ద చర్చగా మారుతోంది. అయితే సినిమా ప్రారంభం, విడుదల తేదీల గురించి మాత్రం విభిన్న వార్తలు వినిపిస్తున్నాయి. తమిళ సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ "జైలర్ 2" సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. ఆ సినిమా పూర్తయ్యే వరకు ఈ మల్టీస్టారర్‌పై ఆయన పూర్తి దృష్టి పెట్టే అవకాశం లేదని టాక్ వినిపిస్తోంది. అందువల్ల ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కావడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉంది. 2026 చివర్లో ఈ సినిమాను పట్టాలెక్కించే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక ఈ భారీ మల్టీస్టారర్ సినిమాను చాలా ప్లానింగ్‌తో తెరకెక్కించాలని దర్శకుడు భావిస్తున్నట్లు సమాచారం. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరికీ సమాన ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఉండేలా కథను సిద్ధం చేస్తున్నారట. యాక్షన్, ఎమోషన్, డ్రామా మేళవింపుతో పాటు ఇద్దరి కాంబినేషన్ సీన్స్ కూడా ఎక్కువగా ఉండేలా స్క్రిప్ట్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ ప్రారంభమైన తర్వాత సుమారు ఆరు నెలల్లో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం. అయినప్పటికీ ఇద్దరు సూపర్ స్టార్స్ డేట్స్ సర్దుబాటు కావడం కూడా కీలక అంశంగా మారింది. ప్రస్తుతం రజనీకాంత్ "జైలర్ 2"తో బిజీగా ఉండగా, కమల్ హాసన్ కూడా పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. దీంతో ఇద్దరి డేట్స్ సమన్వయం కావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఈ కారణాల వల్ల ఈ సినిమా విడుదల 2027 చివర్లో ఉండొచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ డేట్స్ లేదా ఇతర కారణాలతో ఆలస్యం అయితే 2028 వరకు కూడా రిలీజ్ వాయిదా పడే అవకాశం ఉందని అంటున్నారు.

## ఎట్టకేలకు ఓటీటీలోకి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'..

# స్ట్రీమింగ్ ఎప్పుడంటే!




మాస్ మహారాజా రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రం ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 13న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద మంచి విజయం అందుకున్నప్పటికీ డిజిటల్ ప్రీమియర్ కోసం ప్రేక్షకులు భారీగా ఎదురుచూస్తున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 (జుజు5) ఈ చిత్ర డిజిటల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. దీంతో ఈ వారం మార్చి 13 శుక్రవారం నుంచి ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.డైరెక్టర్ కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఫ్యామిలీ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కథానాయికలుగా నటించారు. సునీల్, సత్య, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించగా, భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. థియేటర్లలో విడుదలైన దాదాపు 60 రోజుల తర్వాత ఓటీటీలోకి వస్తున్న ఈ చిత్రం, రవితేజ మార్క్ కామెడీ మరియు ఫ్యామిలీ సెంటిమెంట్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ వీకెండ్‌లో మంచి వినోదాన్ని అందిస్తుందని చెప్పవచ్చు.

## 'రామాయణం' సెట్స్ నుంచి రణబీర్,

# సాయి పల్లవి ఫొటోలు లీక్ చిత్రబృందం క్లారిటీ



బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణం'కు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ఫొటో తెగ వైరలవుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ సెట్స్ నుంచి రాముడిగా నటిస్తున్న రణబీర్‌తో పాటు సీతగా నటిస్తున్న సాయి పల్లవిల ఫొటోలు లీక్ అయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. అయితే ఈ ప్రచారంపై చిత్రబృందం స్పందిస్తూ..

ఆ ఫొటోలు నకిలీవని.. అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన ఫేస్-స్వాప్ చిత్రాలని చిత్రబృందం తెలిపింది. 2015లో ప్రసారమైన 'సియా కే రామ్' సీరియల్‌లోని స్టిల్స్‌ను తీసుకుని, అందులోని నటీనటుల ముఖాలకు బదులుగా రణబీర్, సాయి పల్లవి ముఖాలను ఆకతాయిలు ఎడిట్ చేసినట్లు చిత్రబృందం తెలిపింది.

నితీష్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్, సాయి పల్లవితో పాటు రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఈ భారీ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో మొదటి భాగం 2026 దీపావళికి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉండగా అధికారిక పోస్టర్లు త్వరలోనే విడుదల కానున్నాయి.